

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 08 ఫిబ్రవరి 2022 సంపుటి : 03 సంచిక : 156 పేజీలు : 4 వెల : రూ 3-00

## నకిలీ సమాజ్‌వాదీల వల్లే యూపీ అభివృద్ధిలో స్తబ్దత: మోదీ




న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ, ఆ పార్టీ సన్నిహితుల కారణంగా ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి గండిపడిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సామాన్య ప్రజానీకం అభివృద్ధికి, పేద ప్రజానీకం స్థితిగతులు మెరుగుపరడానికి వాళ్లు చేసిందేమీ లేదని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజనౌర్‌లో సోమవారంనాడు ఏర్పాటు చేసిన జన్ చౌపల్ ర్యాలీని ఉద్దేశించి ప్రధాని వర్చువల్ మీట్ ద్వారా మాట్లాడారు. సమాజ్‌వాదీ పార్టీపై, గతంలో ఆ పార్టీ పాలనపై విమర్శలు గుప్పించారు. యూపీ అభివృద్ధి జలాల్లో స్తబ్ధతకు నకిలీ సమాజ్ వాదీలే కారణమని అన్నారు. తమకోసం, తమ సొంత వాళ్ల దాహం తీర్చేందుకు, స్వలాభం కోసమే వాళ్లు పాటుపడ్డారని, ఆ స్వార్థం వల్లే యూపీలోని అభివృద్ధి జలాల్లో స్తబ్దత ఏర్పడిందని అన్నారు. మరో పాతికేళ్లలో భారత దేశం 100 ఏళ్ల స్వాతంత్ర్యం పూర్తి చేసుకునే సమయానికి యూపీ అభివృద్ధి చరిత్రను తాము (బీజేపీ) తిరగ రాస్తామని, అభివృద్ధిలో యూపీని అగ్రపథంలో నిలుపుతామని ప్రధాని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, రైతుల మేలు కోసం తమ ప్రభుత్వం చేయగలిగినంత సాయం చేస్తూనే ఉంటుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని అనుకున్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడం, హెలికాప్టర్ కదలకపోవడంతో ప్రజలను నేరుగా కలుసుకోలేకపోయానని, ఇందుకు క్షమాపణలు చెబుతున్నానని మోదీ అన్నారు. ఆ కారణంగానే తాను వీడియో కాన్ఫరెన్స్‌కే పరిమితం కావాల్సి వచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై మోదీ ప్రశంసలు కురిపిస్తూ, యోగి హయాంలో నేరస్థులు జైళ్లకు పరుగులు తీశారని, తమంత తాముగా లొంగిపోయారని అన్నారు. ఈ నేరశక్తులు ఇంతకాలం ఎన్నికల కోసవే వేచిచూస్తున్నారని, త్వరగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారితే జైళ్ల నుంచి బయటపడతామని ఆశలు పెట్టుకున్నారని మోదీ అన్నారు. "ఒకప్పటి 'మాఫియా రాజ్' ప్రభుత్వం తిరిగి వస్తుందనే ఆశతో వాళ్లు ఉన్నారు. ఈ నేరశక్తులు ప్రభుత్వం మారితే తిరిగి వెనక్కి తిరిగి రావాలనుకుంటున్నాయి. గత ఐదేళ్లుగా మూతపడిన లూటీలు, బందిపోట్ల వల్ల తాము కోల్పోయిన దానిని ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలనుకుంటున్నాయి" అని మోదీ పేర్కొన్నారు. గతంలో మహిళల వేధింపుల నేవి షరామామూలు వ్యవహారమని, చైన్ స్నాచింగ్‌లు సర్వసాధారణమని, బతికి ఉండటమే గొప్ప అనుకునేలా ప్రజలు ఉండేవారని, అయితే ఆ భయాల నుంచి మహిళలకు యోగి ప్రభుత్వం విముక్తి కలిగించదని చెప్పారు. మహిళలకు నిజమైన గౌరవం తాము కల్పించామని ప్రధాని అన్నారు. కాగా, వర్చువల్ మీట్‌లో యోగి ఆదిత్యనాథ్ సైతం పాల్గొన్నారు.

## అగ్రి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో గణనీయ పురోగతి కనిపించాలి: సీఎం జగన్



తాడేపల్లి:అగ్రి ఇన్‌ఫ్రాపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరిచే విప్లవాత్మక చర్యల ప్రగతిని సీఎం సమీక్షించారు. డ్రై స్టోరేజీ–డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్స్, గోడౌన్లు, హార్టికల్చర్‌లో మౌలిక సదుపాయాలు, ప్రైమరీ ప్రాసెసింగ్‌సెంటర్లు, అసేయింగ్ ఎక్విప్‌మెంట్, ప్రొక్యూర్ మెంట్ సెంటర్లు, ఈ–మార్కెటింగ్, మెగా కస్టం హైరింగ్ హబ్స్, ఆర్బీకేల స్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, వరి పండిస్తున్న జిల్లాల్లో కంబైన్డ్ హార్వెస్టర్లు, ఏంఎపీలు?బీఎంసీలు, ఆక్వా ఇన్‌ఫ్రా, ఫిషింగ్ హార్బర్లు?ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌సెంటర్లు, పశుసంవర్థక శాఖలో మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ఇప్పటివరకూ తీసుకుంటున్న చర్యలను సీఎం సమీక్షించారు. ఈ ఏడాది వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనా ప్రాజెక్టుల్లో గణనీయ పురోగతి కనిపించాలిసాధ్యమైనంత త్వరగా వాటిని రైతులకు, అనుబంధ రంగాలకు అందుబాటులోకి తీసుకురావాలితద్వారా రైతులకు అదనపు ఆదాయాలు లభించేలా చూడాలిక్షేత్రస్థాయిలో కచ్చితంగా మార్పు కనిపించాలిగోదాములు సహా అన్నిరకాల నిర్మాణాలు ఊపందుకోవాలిప్రపంచంలో ఇప్పుడు సేంద్రీయ, సహజ వ్యవసాయ విధానాలద్వారా వచ్చిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందిఈ అవకాశాలను మన రైతులు సద్వినియోగం చేసుకోవాలిప్రతి ఆర్బీకే స్థాయిలో సేంద్రీయ వ్యవసాయం మీద ఒక కస్టం హైర్ సెంటర్ రావాలన్న సీఎంరైతుల్లో అవగాహన పెంచాలన్న సీఎంవచ్చే ఏడాది నాటికి తీసుకు వచ్చేలా ఒక ప్రణాళిక వేసుకోవాలన్న సీఎంసేంద్రీయ, సహజ వ్యవసాయం చేయడానికి అవసరమైన యంత్రాలు, పరికరాలు ఏంకావాలో నిర్ణయించి.. ఆ మేరకు ప్రతి ఆర్బీకే స్థాయిలో ఏర్పాటు చేయాలన్న సీఎంసేంద్రీయ, సహజ వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసే వాటికి మంచి రేటు వచ్చేలా చూడాలని, అలాంటి ఉత్పత్తులు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చేలా ఒక విధానం తీసుకురావాలన్న సీఎంగోడౌన్ల నిర్మాణానికి జిల్లాల్లో దాదాపుగా స్థల సేకరణ పూర్తయ్యిందని, 1165 చోట్ల గోడౌన్లు నిర్మిస్తున్నామని తెలిపిన అధికారులుఇప్పటికే చాలాచోట్ల పనులు మొదలుపెట్టామని తెలిపిన అధికారులు278 చోట్ల గోడౌన్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపిన అధికారులురైతులు మోసాలకు గురికాకుండా బరువును, తేమను కొలిచే పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపిన అధికారులుప్రొక్యూర్ మెంట్‌లో వినియోగించే 6,293 పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్న అధికారులువైఎస్సార్ యంత్రసేవా కింద రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్న వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పరికరాలపైనా ముఖ్యమంత్రి సమీక్ష. ఇప్పటికే 3,497 యూనిట్లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్న అధికారులు. పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికగా మొత్తంగా 33 చోట్ల విత్తనాలు, మరియు మిల్లెట్ ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుఖరీఫ్ 2022 నుంచి అందుబాటులోకి ఈ ప్రాసెసింగ్‌సెంటర్లు. విత్తన శుద్ధి, మరియు ప్రాసెసింగ్‌సెంటర్లు రెండు రకాలుగా ఉపయోగపడనున్న యూనిట్లు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు సాగుచేస్తున్న రైతులు ఈ యూనిట్లను చక్కగా వినియోగించుకోవచ్చన్న అధికారులు. ప్రాసెస్ చేయడంవల్ల రైతులకు మంచి ధరలు లభిస్తాయని, నాణ్యమైన ఉత్పత్తులు కూడా ఉంటాయని తెలిపిన అధికారులు. సెకండరీ ప్రాసెసింగ్ చేసే వాళ్లకు, సంబంధిత వ్యాపారాల్లో ఉన్నవారికి మంచి ముడిపదార్థాలు లభిస్తాయన్న అధికారులు. 13 యూనిట్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతోందన్న అధికారులు.

## 'కొందరు ఉద్యోగులు రాజకీయ పార్టీలతో కలవడం దురదృష్టకరం'

ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ న్యాయం చేశాం

ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి: సమ్మె వరకూ వెళ్లకుండా సమస్యను పరిష్కరించామని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగ సంఘాలతో తరచూ చర్చలు జరిపామన్నారు."ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా వారికి న్యాయం చేశాం. ఉన్నంతలో ఉద్యోగులకు మంచి చేశాం. కొందరు ఉద్యోగులు రాజకీయ పార్టీలతో కలవడం దురదృష్టకరం. పీఆర్సీ సాధన సమితిలో ఉపాధ్యాయ సంఘాలూ భాగమే. మంత్రుల కమిటీ ప్రతిపాదనలకు ఉపాధ్యాయ సంఘాలు సరేనన్నారు. తర్వాత బయటకెళ్లి సంతృప్తిగా లేదనడం సరికాదని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

## ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

చంద్రబాబు నాయుడు



అమరావతి తెలుగు దేశం పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబునాయుడు సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, సీపీయస్, అవుట్సోర్సింగ్, ఆర్టీసీ, కాంట్రాక్టు కార్మికులకు జగన్రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేసింది. రివర్స్ పీఆర్సీ ఇచ్చింది. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన అనేక రాయితీల్లో ఈ ప్రభుత్వం కోత విధించడం సీయం పెద్ద మనస్సుకు నిదర్శనమా? అల్ప బుద్ధికి నిదర్శనమా? టీడీపీ పాలనలో ఆర్థిక పరిస్థితి ఘోరంగా వున్నా 43% ఫిట్మెంట్ ఇచ్చిందని అయన గుర్తు చేసారు. లూటీ, దుబారా కట్టిపెట్టి ఉద్యోగుల, పించన్దారుల, కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి. టీడీపీ ఇచ్చిన రాయితీల్లో కోతలు కోయరాదు. కరెంటు కోతలు వెంటనే నివారించాలి. విద్యుత్ ఛార్జీల భారాలు తగ్గించాలి. డిస్కమ్లకు ప్రభుత్వ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. 32 నెలల పాలనలో 6 సార్లు కరెంటు ఛార్జీలు పెంచారు. రూ.11,611 కోట్లు ప్రజలపై భారం మోపారు. పాఠశాలల విలీనం వల్ల చిన్న పిల్లలు దూరాభారాలు పెరిగి నష్టపోతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారు. పాఠశాలల విలీన నిర్ణయాన్ని రద్దు చేయాలి. భారతి సిమెంటు ప్రయోజనాల కోసం భవన నిర్మాణ రంగాన్ని దెబ్బతీయ వద్దు. వేలకోట్ల ముడుపుల కోసం ఉచిత ఇసుక విధానం రద్దుచేసి 4 రెట్లు ఇసుక ధర పెంచారు. సిమెంటు బస్తాపై ఈ మూడేళ్లలో రూ.150లు పెంచారు. సిమెంటు, ఇసుక ధరలు తగ్గించాలని అన్నారు. టీడీపీ పాలనలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్దిదారులకు స్వాధీనం చేయాలి. టిడ్కో గృహాల పేరుతో తెచ్చిన రూ.7,300 కోట్లు దారిమళ్లించారుఇప్పుడులబ్ధిదారుల పేరుతో మరో రూ.4వేల కోట్ల అప్పుకు సిద్ధం అవుతున్నారు. హైకోర్టు తీర్పు రిజర్వులో ఉన్నప్పుడు రాజధాని భూములు తనఖా పెట్టడం చట్ట విరుద్ధం కాదా? ఏపీపీయస్సీ, డీయస్సీ, పోలీస్ రిక్రూట్మెంట్తో 2లక్షల 30వేల ఉద్యోగాల భర్తీకి రీ నోటిఫికేషన్ ఇవ్వాలి. ధాన్యం, ఇతర దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. బకాయిలు వెంటనే విడుదల చేయాలి. మద్యం రేట్ల పెంపుదల వల్ల కల్తీ కల్లు బారినపడి మృతిచెందిన5 మంది ఆదివాసీ గిరిజన కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అయన అన్నారు.

## హైకోర్టుకు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్

అమరావతి: హైకోర్టుకు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ హాజరయ్యారు. రోడ్డు కాంట్రాక్టర్‌కు బిల్ ఇవ్వని కేసులో ఆయన హాజరైయ్యారు. కోర్టు ఆదేశాలిచ్చినా బిల్ ఎందుకు చెల్లించడం లేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. కోర్టు ధిక్కారం పిటిషన్ వేసిన తర్వాత డబ్బులు చెల్లించడంపై ఆరా తీసింది. ఏళ్ల తరబడి బిల్లులు ఎందుకు పెండింగ్ పెడుతున్నారని హైకోర్టు పేర్కొంది. రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, కాంట్రాక్టర్లకు బిల్లుల పెండింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది. బిల్లులు చెల్లించక పోవడం వల్లే వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశాలివ్వాల్సి వస్తుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో గత వారం బిల్లు చెల్లించినట్లు ఏపీ ప్రభుత్వం పేర్కొంది. రూ.62.94లక్షల బిల్లు చెల్లింపులో జాప్యం చేస్తున్నారంటూ న్యాయవాది గొట్టిపాటి కవిత కోర్టును ఆశ్రయించారు.





## రాజ్యసభలో టీడీపీ విషప్రచారం.. తిప్పికొట్టిన ఎంపీ విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ: రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై టీడీపీ విషప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వి.విజయసాయిరెడ్డి బలంగా తిప్పికొట్టారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మాణంపై చర్చ సందర్భంగా టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అవాస్తవాలను వల్లేవేశారు. సినిమా టికెట్లు సహా పలు అంశాలపై తప్పుడు ప్రచారం చేయడానికి కనకమేడల ప్రయత్నించారు. దీనిపై స్పందించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తంచేశారు. అంతేకాకుండా టీడీపీ పాలన కంటే వైఎస్సార్‌సీపీ పాలన వెయ్యిరెట్లు గొప్పగా ఉందని స్పష్టం చేశారు.




## భద్రత కల్పించినా ఒవైసీనే నిరాకరించారు: అమిత్‌షా

న్యూఢిల్లీ: ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి కేంద్రం భద్రత కల్పించినా ఆయనే నిరాకరించారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభకు తెలిపారు. యూపీలోని మీరట్‌లో ఒవైసీ కారుపై దుండగులు ఇటీవల కాల్పులు జరిపిన ఘటన సంచలనం సృష్టించింది. దీనిపై అమిత్‌షా రాజ్యసభలో ఒక ప్రకటన చేస్తూ, ఘటన జరిగిన వెంటనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకున్నామని చెప్పారు. దీనికి ముందు కేంద్ర భద్రతా సంస్థల సమాచారం మేరకు ఒవైసీకి భద్రత కల్పించాలని కేంద్రం ఆదేశించినట్టు చెప్పారు. అయితే, అందుకు ఒవైసీ ఇష్టపడలేదని, ఢిల్లీ, తెలంగాణ పోలీసులు ఆయనకు భద్రత కల్పించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఫలించలేదని చెప్పారు. దీంతో ఒవైసీ భద్రతను మరోసారి అంచనా వేసి ఒక బుల్లెట్ ప్రూవ్ కారు, జడ్ కేటగిరి సెక్యూరిటీ కేటాయించామని తెలిపారు. అప్పుడు కూడా ఒవైసీ నిరాకరించినట్టు సభకు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కల్పించిన భద్రతకు ఒవైసీ సమ్మతించాలని విజ్ఞప్తి చేశారు. ఒవైసీపై కాల్పుల ఘటన జరిగిన వెంటనే తక్షణ చర్యలు చేపట్టామని, ఆ ఘటనతో ప్రమేయం ఉన్న ఇద్దర్ని అరెస్టు చేశామని, లైసెన్స్ లేని రెండు పిస్తోళ్లు, ఒక ఆల్టో కారు వారి నుండి స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా తెలిపారు. ఫోరెన్సిక్ టీమ్ సైతం సాక్ష్యాలను సేకరించిందని అన్నారు. హపూర్ జిల్లాలో పర్యటనకు సంబంధించి ఒవైసీ ప్రీషెడ్యూల్ కూడా లేదని, ఆయన పర్యటనకు సంబంధించిన సమాచారం కూడా జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయలేదని పేర్కొన్నారు. కాల్పుల ఘటన అనంతరం ఒవైసీ సురక్షితంగా ఢిల్లీకి చేరుకున్నట్టు అమిత్‌షా వివరించారు.



## పార్లమెంట్‌లో సొమ్మసిల్లిపడిపోయిన పిల్లి సుభాష్ చంద్రబోస్

ఢిల్లీ: వైసీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ పార్లమెంట్‌లో సొమ్మసిల్లి పడిపోయారు. బీపీ, షుగర్ ఒక్కసారిగా పడిపోవడంతో ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. అప్రమత్తమైన సహచర ఎంపీలు వెంటనే స్ట్రెచర్ తెప్పించి ఆయన్ను రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోంది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యవర్గాల ద్వారా తెలిసింది.



# సంపాదకీయం

మంగళవారం 08 ఫిబ్రవరి 2022

## శాంతి స్థాపన కోసం భారత్-పాక్ ల మధ్య రహస్య చర్చలు? ఎడిటోరియల్

భారత్-పాక్ మధ్య సత్సంబంధాలు నెలకొంటాయా? రెండు దేశాల మధ్య మళ్లీ సాధారణ పరిస్థితులు వస్తాయా? దీనికి సంబంధించి అనధికారికంగా రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయా? అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. ఇందుకు నిదర్శనంగా తాజాగా పాకిస్తాన్‌కు చెందిన వ్యాపారవేత్త చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న అనధికారిక చర్చలు సఫలమైతే.. భారత ప్రధాని నరేంద్ర మోదీ పాక్ పర్యటనకు వచ్చే అవకాశం ఉందంటూ పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వియాన్ మన్షా అన్నారు. ఈ కామెంట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. నిజంగానే భారత్-పాక్ మధ్య అనధికారిక చర్చలు జరుగుతున్నాయా? ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరిచేందుకు కృషి జరుగుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల పాకిస్తాన్ రాజధాని లాహోర్‌లో జరిగిన లాహోర్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో నిషాత్ గ్రూప్ ఛైర్మన్ వియాన్ మన్షా.."ఇరు దేశాల మధ్య పరిస్థితులు మెరుగుపడితే, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఒక నెలలోపు పాకిస్తాన్‌ను సందర్శించవచ్చు." అని చెప్పారు. ఇదే విషయాన్ని పాక్ మీడియా సంస్థ 'ది డాన్' ప్రధాన శీర్షికగా పేర్కొంది. అయితే, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మంత్రి విభిన్నంగా స్పందించింది. ప్రైవేట్ వ్యక్తుల నుంచి వచ్చిన వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. బిలియనీర్ అయిన మన్షా.. నిషాత్ గ్రూప్ వ్యవస్థాపకుడు. ఈ సంస్థ.. విద్యుత్ ఉత్పత్తి, సిమెంట్, బ్యాంకింగ్, ఆటోమొబైల్, హాస్పిటాలిటీ, ఇతర రంగాలలో ఉంది. పాకిస్తాన్‌లో ఇది అతిపెద్ద పారిశ్రామిక సంస్థ. లాహోర్ వేదికగా జరిగిన ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో ప్రసంగించిన మన్షా.. "పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడకపోతే.. దేశం వినాశకరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పాకిస్తాన్ భారతదేశంతో వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలి. ఆర్థిక అభివృద్ధికి ప్రాంతీయ విధానాన్ని అనుసరించాలి. యూరప్ రెండు గొప్ప యుద్ధాలు చేసింది. కానీ చివరికి శాంతి, ప్రాంతీయ అభివృద్ధి కోసం రాజీపడింది. కావాల్సింది శాశ్వత శత్రుత్వం కాదు, అభివృద్ధి కావాలి." అని మన్షా పేర్కొన్నారు. అంతేకాదు.. ఇరు దేశాలు తమ వివాదాలను పరిష్కరించుకోవాలని, ఈ ప్రాంతంలో పేదరికంపై పోరాడేందుకు వాణిజ్యాన్ని ప్రారంభించాలని మన్షా సలహా ఇచ్చారని ది డాన్ పేర్కొంది. ఇదిలాఉంటే.. భారత్-పాక్ సంబంధాలపై పాకిస్తాన్ జాతీయ భద్రతా సలహాదారు మొయిద్ యూసుఫ్ కీలక కామెంట్స్ చేశారు. రెండు దేశాల మధ్య చర్చలకు మంచి వాతావరణాన్ని సృష్టించే బాధ్యతను భారతదేశంపై నెట్టారు. "మేము ముందుకు సాగాలని కోరుకుంటున్నాము. కానీ చర్చలు జరిగే మంచి వాతావరణం భారతదేశం నుండి రావాలి" అని యూసుఫ్ వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వం "ప్రబలమైన భావజాలం" చర్చలకు ఉన్న అన్ని మార్గాలను మూసివేసిందని వ్యాఖ్యానించారు. నిజంగానే చర్చలు జరుగుతున్నాయా? పాకిస్తాన్ పారిశ్రామిక వేత్త మన్షా చేసిన కామెంట్స్ ప్రకారం.. భారత్-పాకిస్తాన్ మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వ చర్చలు జరుగుతున్నాయా అనేది ఆసక్తిగా మారింది. భారత్-పాక్ మధ్య 75 ఏళ్లుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఏనాడూ రెండు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొన్న దాఖలాలు లేవు. అయితే, ఈ దఫా చర్చల అంశంపై పారిశ్రామిక వేత్త చేసిన వ్యాఖ్యలను కొట్టిపారేయలేమంటున్నారు విశ్లేషకులు. మధ్యవర్తిత్వ చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. అయితే, ఈ చర్చల గురించి పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు రాజకీయ పరిశీలకులు. 1947 లో రెండు దేశాలు స్వతంత్ర దేశాలుగా మారినప్పటి నుండి, రెండు దేశాల మధ్య ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి ఎన్నోమార్లు సంప్రదింపులు జరిగాయి. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. చర్చల సందర్భంగా ఒప్పందాలు చేసుకోవడం.. ఆ తరువాత వాటిని విస్మరించడం తరచుగా జరుగుతూనే ఉంది. ఇక భారతదేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పాకిస్తాన్‌తో సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. ఎన్నో ఘర్షణలు చోటు చేసుకున్నాయి కూడా. పాక్, చైనా సంబంధాలు, ఉగ్రవాదుల వ్యవహారం, పుల్వామా ఘటన, బాలాకోట్ దాడులు వంటి ఎన్నో సంఘటనలు భారత్-పాక్ మధ్య సంబంధాలకు పూర్తిగా ఇలాంటి తరుణంలో ఇరు దేశాల మధ్య మళ్లీ సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు రావడం అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో తెలియాలంటే పరిస్థితులను గమనించాల్సిందే.

## ప్రేమదాస్ కథ ఇంతింత కాదయా..

విశాఖపట్టణం, ఫిబ్రవరి 7, ( విశాఖపట్నం జిల్లాలో వెలుగుచూసిన కీచక పాస్టర్ అనిల్ అలియాస్ ప్రేమ్ దాస్ లైంగిక వేధింపుల వ్యవహారంలో పోలీసులు కీలక ఆధారాలను సేకరించారు. ఆధ్యాత్మికత ముసుగులో మాయమాటలతో ఓ యువతిని ట్రాప్ చేసి లోబరుచుకున్నట్టు నిర్ధారించారు. వివరాల్లోకెళితే.. విజయవాడకు చెందిన అనిల్ కొన్నేళ్ల క్రితం విశాఖ జిల్లాకు వచ్చాడు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురంలో ప్రేమ స్వరూపిని ట్రస్ట్ ను ఏర్పాటు చేసి ఓ యూట్యూబ్ ఛానల్ కూడా సిద్ధం చేశాడు. అందులో దేవుడి పేరు చెప్పి ఉపదేశాలు మొదలుపెట్టి పాస్టర్ గా చెప్పుకుంటున్న ప్రేమ దాస్.. అందర్నీ ఎట్రాక్ట్ చేయడం ప్రారంభించాడు. చానల్లో సబ్ స్క్రైబ్ గా ఉన్నవారిని ఒక్కొక్కరిని మెల్లగా మాయమాటలతో తనవైపు ఆకర్షించాడు. దీంతోపాటు కొన్ని పుస్తకాలు ప్రచురించి.. సభలు సమావేశాలు కూడా పెట్టేవాడు. దేవుడి పేరుతో చందాలు కూడా వసూలు చేసేవాడు. తన మాటలకు ఎట్రాక్ట్ ఆయన కొంతమంది.. అతని దగ్గరకు వచ్చేసారు. దీంతో తన దగ్గరికి వచ్చిన వారిని మెల్లగా మాయమాటలతో ట్రాప్ చేయడం ప్రారంభించినట్టు నిర్ధారించారు పోలీసులు. ఇక కోదాడకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసేది. 2018 లో ఈ ప్రేమ దాసు రచించిన పుస్తకం చూసి ప్రేమ్ దాస్ కు కాల్ చేసిన పాపానికి ఆమెను ట్రాప్ చేయడం ప్రారంభించాడు. పాయకరావు పేటలో ఉన్న తన మినిస్ట్రీస్ కి వచ్చి దేవుడు సేవ చేయాలని మాటల్లో పెట్టి మాయ చేసాడు. అప్పటి నుంచి తన దగ్గరే ఉంచుకుని ఆమెను శారీరకంగా, మానసికంగా, లైంగికంగా వేధించినట్టు పోలీసుల విచారణలో తెలిసింది. ఇదిలాఉంటే మరో మహిళతో కూడా ఈ పాస్టర్ సహజీవనం చేసేవాడని తేల్చారు పోలీసులు. యువతిని ట్రాప్ చేసే వ్యవహారంలో ఆమె కూడా పాస్టర్ అనిల్ కు సహకరించినట్లు గుర్తించారు. ఓవైపు రాజేశ్వరితో సహజీవనం చేస్తూనే.. మరోవైపు ఆ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించే వాడు ఈ పాస్టర్. అంతేకాదు బూతు చిత్రాలు కూడా పంపించమని చెప్పేవాడు. తాను యువతిని శారీరకంగా, లైంగికంగా వేధించడంతో పాటు సహజీవనం చేస్తున్న మహిళ తమ్ముడుతో ఆమెకు బలవంతపు పెళ్లి కూడా చేశాడు. అంతేకాదు ఓసారి అబార్షన్ కూడా బలవంతంగా చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ టార్చర్ భరించలేకపోయిన యువతి బయటకు వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో పాస్టర్ పాపాల పుట్ట బయటపడుతోంది. ఈ కేసులో ఇప్పటి వరకు ప్రధాన నిందితుడిగా పాస్టర్ అనిల్ తో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురిని కేసులో చేర్చారుమరోవైపు పాస్టర్ ఆధ్యాత్మికత ముసుగులో నడుపుతున్న ఆశ్రమంలో 27 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో మహిళలు, పురుషులు కూడా ఉన్నారు. పాస్టర్ మాయమాటల్లో పడి వీరు తమ కుటుంబాలకు దూరమయ్యారు. అయితే వీరందరినీ ఐసీడీఎస్ రెవెన్యూ అధికారులు కౌన్సెలింగ్ చేశారు. ఆశ్రమాన్ని ఖాళీ చేయించి.. కొంతమందిని తూర్పు గోదావరి జిల్లాకు వారి కుటుంబ సభ్యులు అప్పగించగా.. మిగిలిన వారిని విశాఖలో ఐసిడిఎస్ అధికారులు వన్ స్టాప్ సెంటర్ కు తరలించారు.

18 మందికి విముక్తి

ప్రేమదాస చెరలో ఉన్న వారందరికీ విముక్తి కల్పించిన అధికారులు అతడి భవంతికి శనివారం తాళం వేశారు. కొందరు బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది యువతులు, నలుగురు యువకులు అతడి భవంతిలో బందీలుగా ఉన్నట్టు గుర్తించారు. తమ ఇళ్లకు పంపమని కోరిన 8 మందిని ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య వారి స్వస్థలాలకు పంపించారు. 14 మంది తాము భవనం ఖాళీ చేసే ప్రసక్తి లేదని, ఇక్కడే ఉంటామని మొండికేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చి శనివారం వారిని కూడా విశాఖ కేజీహెచ్‌లోని దిశ షెల్టర్ హోమ్‌కు తరలించారు. వారిలో నలుగురు మైనర్లు కూడా ఉన్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వధార్ హోమ్‌కు తరలిస్తామని, మరోసారి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు చెప్పారు. సంస్థ నిర్వాహకుడైన అనిల్‌కుమార్ అలియాస్ ప్రేమదాసు, అతనికి సహకరించిన మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుల నుంచి కొన్ని ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రేమదాస్‌కు సహకరించిన రాజేశ్వరి అలియాస్ లిల్లీ పరారీలో ఉంది. ఆమె కోసం గాలిస్తున్నారు.

## శపథం పక్కన పెట్టాల్సిందేనా

విజయవాడ, ఫిబ్రవరి 7, (చంద్రబాబు శపథం చేశారు. అసెంబ్లీకి ఇక అడుగుపెట్టబోనని ఆయన శాసనసభ సాక్షిగా చెప్పేసి వచ్చారు. తిరిగి ముఖ్యమంత్రి హోదాలోనే సభలోకి అడుగుపెడతానని చెప్పారు. చంద్రబాబు అసెంబ్లీకి ఈ రెండున్నరేళ్లలో వెళ్లే అవకాశం లేదు. అయితే కీలకమైన అంశాలన్నీ చంద్రబాబు గైర్హాజరీలోనే అసెంబ్లీ ముందుకు వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. చంద్రబాబు తొందరపడి శపథం చేశారా? అన్న చర్చ పార్టీలోనూ జరుగుతుంది. గతంలోనూ ముఖ్యమంత్రి జగన్ దాదాపు రెండేళ్ల పాటు అసెంబ్లీని బహిష్కరించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకోవడమే కాకుండా వారిలో కొందరికి మంత్రి పదవులు ఇవ్వడంతో జగన్ అసెంబ్లీకి రానని ప్రకటించి ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. పాదయాత్ర చేశారు. తిరిగి ముఖ్యమంత్రిగానే సభలోకి అడుగు పెట్టారు. కానీ జగన్ తాను ఒక్కడే కాకుండా పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించింది. అప్పుడు కూడా విపక్షం లేకుండానే సభను నిర్వహించారు. అయితే చంద్రబాబు మాత్రం తానొక్కడే అసెంబ్లీని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారు. వచ్చేది బడ్జెట్ సమావేశాలు. ఈ సమావేశాల్లో కీలక అంశాలపై చర్చ జరుగుతుంది. ముఖ్యమైన బిల్లులు వచ్చే అవకాశముంది. కొత్త జిల్లాల ఏర్పాటు విషయం కూడా అసెంబ్లీలో చర్చకు రానుంది. అలాగే కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, వైసీపీ ఎంపీ ల వైఫల్యంపై మాట్లాడే ఛాన్స్ చంద్రబాబు కోల్పోయారు. ఎన్టీఆర్ పేరు పెట్టడం వంటివి కొన్ని తమకు అనుకూల నిర్ణయాలు తీసుకున్నా, వ్యతిరేకంగా అనేక అంశాలున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. కీలక బిల్లులు... దీంతో పాటు మరోసారి మూడు రాజధానుల బిల్లులను కూడా అసెంబ్లీకి జగన్ తెచ్చే అవకాశముంది. గతంలో తాను చెప్పినట్లుగా బిల్లుల్లో మార్పులు చేసి తీసుకువస్తానని జగన్ అసెంబ్లీ సాక్షిగానే చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో కాకపోయినా ఏదో ఒక సమావేశాల్లో బిల్లులను జగన్ తెచ్చే అవకాశముంది. జిల్లాల విభజన, మూడు రాజధానులు వంటి కీలక అంశాలు చర్చ జరిగే సమయంలో చంద్రబాబు సభలో ఉండక పోవడం పార్టీకి ఇబ్బందికరమే. మరి చంద్రబాబు శపథంపై నిలబడతారా? లేక రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అసెంబ్లీకి వెళతారా? అన్న సందిగ్ధంలో ఉన్నారట. అసెంబ్లీకి వెళ్లే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని చెబుతున్నారు.

## చీలిపోయిన ఉద్యోగ సంఘాలు

విజయవాడ, ఫిబ్రవరి 7, ( సున్నకు సున్నా .. హళ్లికి హళ్లి ...సింగన్న అద్దంకి పోనూ ..పోయాడు...రానూ వచ్చాడు ..వట్టి చేతులతోసుమారు 20 రోజులకు పైగా, 'పీఆర్సీ సాధన సమితి' పేరిట డ్రామా నడిపిన ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగ సంఘాల నాయకులు, చివరకు ఏమి సాధించారు అంటే సున్నకు సున్నా .. హళ్లికి హళ్లి ... ఉప్పెనలా ఎగసి పడిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల, 'చలో విజయవాడ' ఆందోళన ఫలాలు నోటికి చెరక ముందే పీఆర్సీ సాధన సమితి నేతలు పంచేసుకున్నారు,అమ్మేసుకునంరు అనే మాటే, ఈరోజు ఉద్యోగుల నోట వినవస్తోంది. ఏ కమిటీకి అయితే ఏ అధికాలు లేవు .. అధికారాలు లేని మంత్రుల కమిటీతో చర్చలు ఏమిటి ... ముందు పీఆర్సీ నివేదిక ఇవ్వడి ఆ తర్వాతనే చర్చలు .. అంటూ ఏ కమిటీని అయితే తూలనాడారో.. అదే కమిటీతో... పీఆర్సీ నివేదికను కంటితో చూడకుండానే .. రెండు రోజుల పాటు చర్చలు జరిపారు. చర్చలకు మూడు షరతులు అన్నారు .. సర్కార్ ఒక్క షరతుకు ఒప్పుకోలేదు. అయినా తగడునమ్మా అంటూ కట్టకట్టుకుని చర్చలు వెళ్లారు. రెండు రోజులు చర్చించారు.కానీ, ఏమి సాధించారు. వ్రతం చెడ్డ ఫలితం దక్కిందా అంటే అదీ లేదు. అమ్ముడు పోయారన్న నిందను, తమ ఆశలను, హక్కులను అమ్మేశారాన్న,ఉద్యోగుల ఆవేదన తప్ప,నలుగు సంఘాలు కలిసి ఒకటైన పీఆర్సీ సాధన సమితి సాదించింది శూన్యం. ఇది ఎవరో గిట్టని వాళ్లు, ఉద్యోగుల ఆందోళన నుంచి రాజకీయ ప్రయోజనం ఆశించిన ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ అసలే కాదు, నేతలను నమ్మి మోసపోయామని ఆవేదన చెందుతున్న ఉద్యోగులు వ్యక్త పరుస్తున్న ఆవేదన, ఆగ్రహం.అంతే కాదు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఏదో చేస్తారు సాధిస్తారు అనుకుంటే, తాచెడ్డ కోతి వనమంతా చెరిచింది అన్నట్లుగా, ఉపాధ్యాయ సంఘాలను నిలువునా ముంచేశారు. కాదు, అమ్మేశారు. ఇది కూడా ఎవరో చేసిన ఆరోపణ కాదు, ఉపాధ్యాయ సంఘాల నాయకులే పోరాటం పేరుతో ఉద్యోగ సంఘాల నాయకులు తమను కూడా ప్రభుత్వానికి అమ్మేశారన్న అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు, పీఆర్సీ సాధన సమితిలో సభ్యులుగా ఉన్నఉపాధ్యాయ ప్రతినిధులు, తాము అమ్ముడుపోయందుకు సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు.ఉద్యోగ సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలోనే నల్ల బ్యాడ్జిలు తీసీసి, 'నమ్మె ప్రతిపాదనను వెనక్కితీసుకుంటున్నట్లు ప్రకటించి.,సర్కార్'కు సలాం చేశారు. ప్రభుత్వాన్ని స్తోత్ర గీతాలతో ప్రశంసించారు. ఆందోళన సమయంలో పొరపాటున నోరుజారి ముఖ్యమంత్రిని ఒక మాటన్నా పెద్ద మనసు చేసుకుని క్షమించాలని వేడుకున్నారు. అందుకే, కావచ్చు గతంలో ఎప్పుడు ఉద్యోగ సంఘాలు ఈ స్థాయిలో సర్కార్' దాసోహం అనలేదు అనేమాట ఉద్యోగుల నుంచి వినవస్తోందిఅయితే, ఏపీటీఎఫ్, యూటీఫ్,ఎస్టీయు, ఏపీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాత్రం ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు చేసుకున్న ఒప్పందాన్ని నిరశిస్తూ, 30 శాతం ఫిట్మెంట్ సహా తమ డిమాండ్ల సాధన కోసం తమతో కలిసి వచ్చే సంఘాలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, భానుమూర్తి, పాండురంగా రావు ఒక ప్రకటన విడుదళ చేశారు.అయితే, ఉద్యోగ సంఘాల నాయకులు మాత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఒప్పించే, బాధ్యత (కొందరు ఉద్యోగులు 'కాంట్రాక్టు' అంటున్నారు) కూడా తామే తీసుకున్నారు. సరే ఉపాధ్యాయ సంఘాల నాయకులను, ఉద్యోగ సంఘాల నాయకులు ఒప్పించగలరా? లేదా? అన్నది పక్కన పెడితే, ఇప్పటికే 'సర్కారీ' నేతలుగా పేరుపడిన ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారని, సోషల్ మీడియాలో వస్తున్న, పోస్టులు, కామెంట్స్' బట్టి తెలుస్తోంది. అంతే కాదు, ఉద్యోగ సంఘాల నాయకులతో ఉన్న సన్నిహత సంబంధాలను, ఇతర అనుబంధాలను అడ్డుపెట్టుకుని, ఇప్పటికి ప్రభుత్వం పైచేయి సాధించినా, ఈ మోసానికి అటు ప్రభుత్వం, ఇటు ఉద్యోగ సంఘాల 'సర్కారీ' నేతలు మూల్యం చెల్లించక తప్పదని అంటున్నారు. ఇల్లు అలక గానే పండగ రాదు ... సమయం వచ్చినప్పుడు సరైన సమాదానం చెపుతామని అంటున్నారుఆదలా ఉంటే ఏపీ పరిణామాలను గమనిస్తున్న రాజకీయ విశ్లేషులు, 2003లో తమిళనాడులో ఆ రాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి జయలిత 70 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులపై డిస్మిస్ కొరడా ఝులిపించి చెల్లించిన మూల్యాన్ని గుర్తుచేస్తున్నారు.అప్పట్లో జయలలిత , ఇలాగే ఉద్యోగుల ఆందోళను ఉక్కు పాదంతో అణచివేశారు.. విజయ గర్వాన్ని ప్రదర్శించారు .. కానీ,, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ... చిత్తు చిత్తుగా ఓడి పోయారు. తమిళనాడు అసెంబ్లీ లోని మొత్తం 234 స్థానాలకు గానూ జయలిత పార్టీ అన్నాడిఎంకె కేవలం 37 స్థానలతోనే సరిపెట్టుకోవలసి వచ్చిందని, విశ్లేషకులు గుర్తు చేస్తునారు. మరి ఏపీలో ఏమి జరుగుతుంది? చివరకు ఏమవుతుంది? చూడాలి.


## వివాదాల మంత్రి

గుంటూరు, ఫిబ్రవరి 7, (ఎప్పుడూ ఏదో ఒక వివాదం లేకపోతే ఏపీ దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కు నిద్ర పట్టదేమో! వివాదాలు ఆయనకు ఆనవాయితీగా మారాయేమో! అప్పుడు రామతీర్థాలు ఇష్యూలో వంశపారంపర్య ధర్మకర్త అశోక్ గజపతిరాజును కించపరిచేలా మాట్లాడడం పెను దుమారమే లేపింది. ఆనక మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో ఢీ అన్నారు. తాజాగా పెదకాకానిలోని మల్లన్న ఆలయం ఈఓ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కిలారి రోశయ్యతో కయ్యానికి సై అంటున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. తన పేషీలో పనిచేసే ఒకరికి, తన ఇంట్లో పనిచేస్తున్న ముగ్గురు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గతంలో మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి జీతాలు వెళ్లేలా చేశారు మంత్రి. ఆయన దేవాదాయశాఖ మంత్రి కదా..! తన పనివాళ్లకు ఆలయాల నుంచే జీతాలు ఇప్పించాలనుకున్నట్లురాయాన. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వాటిని నిలిపివేయించారు. తాజాగా గుంటూరు జిల్లా పెదకాకాని మల్లన్న సన్నిధిని ఆధిపత్య పోరుకు వేదికగా మార్చారు వెల్లంపల్లి. అప్పుడు ఆర్కేతో, ఇప్పుడు పెదకాకాని ఎమ్మెల్యే కిరారి రోశయ్యతోనూ మంత్రి వెల్లంపల్లి కయ్యానికి కాలుదువ్వారు. తన పేషీలో, ఇంట్లో పనిచేసేవారికి మంగళగిరి ఆలయం నుంచి జీతాలు వెళ్లకుండా ఆర్కే నిలిపివేయించారు. ఆలయం ఈఓ పానకాలరావును వెళ్లిపోవాలని కూడా ఎమ్మెల్యే ఆర్కే ఆదేశించారు. అప్పటి నుంచీ పానకాలరావు పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. తర్వాత పెదకాకానిలోని మల్లన్న ఆలయం నుంచి ఆ నలుగురికి జీతాలు చెల్లించాలని ఈఓను మంత్రి పేషీ ఆదేశించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కిలారి రోశయ్య కూడా అడ్డుకున్నారు. 'నా ఆదేశాలే ధిక్కరిస్తావా?' అంటూ మల్లన్న ఆలయం ఈఓపై మంత్రి వెల్లంపల్లి నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే ఇవ్వొద్దంటే నేనేం చేయాలంటూ ఈఓ చేతులెత్తేశారట. తర్వాత ఇటీవల ఒకసారి సీఎం కార్యక్రమంలో ఎదురుపడిన మంత్రి వెల్లంపల్లి- ఎమ్మెల్యే రోశయ్య మధ్య మాటల యుద్ధమే జరిగిందంటున్నారు. ఈ క్రమంలోనే తన వర్గీయుడైన పానకాలరావును పెదకాకాని మల్లన్న ఆలయం ఈఓగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డిని ట్రాన్స్ ఫర్ చేశారు మంత్రి వెల్లంపల్లి. తన ఆదేశాలను ధిక్కరించాడనే సాకుతో శ్రీనివాసరెడ్డిపై బదిలీ వేటు వేశారాయన. అయితే.. గత జనవరి 20వ తేదీన ఉత్తర్వుల కాపీతో మల్లన్న ఆలయానికి వచ్చిన పానకాలరావును విధుల్లో చేరొద్దని ఎమ్మెల్యే కిలారి హెచ్చరించారు. ఈ విషయం కూడా తన పేషీకి చేడంతో మంత్రి వెల్లంపల్లిలో ఆగ్రహం కట్టలు తెంచుకుందట. అంతే ప్రకాశం జిల్లా సింగరాయకొండ ఆంజనేయస్వామి ఆలయం ఈఓగా శ్రీనివాసరెడ్డి పనిచేసినప్పుడు అవకతవకలు జరిగాయంటూ సస్పెండ్ చేశారు.

## అనంతలో లిథియం... ఖనిజాలు

అనంతపురం, ఫిబ్రవరి 7, అరుదైన ఖనిజాలకు నిలయమైన 'అనంత'లో మరో విలువైన ఖనిజం ఉనికి లభించింది. ప్రపంచంలోనే అత్యంత అరుదుగా లభించే లిథియం ఖనిజ నిక్షేపాలు జిల్లాలో భారీగా ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వేలో గుర్తించారు. ఇదే విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా ధ్రువీకరించారు. లిథియం ప్రాజెక్టుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కోటగిరి శ్రీధర్, చింతా అనురాధ, డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్ ఈ నెల రెండో తేదీన పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందుకు మంత్రి ప్రహ్లాద్ జోషి రాతపూర్వక సమాధానమిస్తూ అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ఈ నిక్షేపాలున్నట్లు గుర్తించామని వెల్లడించారు. జీఎస్ఐ శాస్త్రవేత్తలు కొన్ని నెలల క్రితం జిల్లాలోని తాడిమర్రి మండలం తురకవారిపల్లె, దాడితోట ప్రాంతాలతో పాటు సమీపంలోని వైఎస్సార్ జిల్లా పార్నపల్లె, లోపటనూతల ప్రాంతాల్లో ఫీల్డ్ సర్వే చేశారు. ఈ ప్రాంతాల్లోని మట్టి, శిలలు, ప్రవాహ అవక్షేపాలను సేకరించి పరీక్షించారు. 18 పీపీఎం నుంచి 322 పీపీఎం (పార్ట్ పర్ మిలియన్) మోతాదులో లిథియం నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించారు. లిథియం ఖనిజం చాలా అరుదుగా లభిస్తుంది. ఇప్పటివరకూ చిలీ, ఆస్ట్రేలియా, పోర్చుగల్ వంటి దేశాల్లో మాత్రమే ఎక్కువగా లభిస్తోంది. ఈ ఖనిజాన్ని రీచార్జబుల్ బ్యాటరీలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ కెమెరాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఎక్కువగా వాడుతున్నారు. అంతేకాకుండా గుండెకు అమర్చే పేస్‌మేకర్ల తయారీలోనూ వినియోగిస్తున్నారు. ఈ ఖనిజాన్ని 1817లో స్వీడన్‌కు చెందిన రసాయన శాస్త్రవేత్త జాన్ అగస్ట్ ఆర్ఫ్‌వెడ్‌సన్ కనుగొన్నారు. ఇది మార్కెట్‌ను శాసించింది మాత్రం 1990 తర్వాతనే. దీన్ని ప్రపంచ దేశాలన్నిటికీ పై కొన్ని దేశాలు మాత్రమే సరఫరా చేస్తున్నాయి. ఇలాంటి అరుదైన ఖనిజం ఉనికి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో లభించడం గొప్ప విషయమని నిపుణులు అంటున్నారు. అనంతపురం జిల్లా విలువైన ఖనిజాలకు కేరాఫ్‌గా ఉంది. బంగారు, వజ్రాలు, బైరటీస్, ఇనుము తదితర ఖనిజ నిక్షేపాలు జిల్లాలో ఉన్నాయి. ఇప్పుడు లిథియం నిక్షేపాలు కూడా వెలుగు చూడడం విశేషం. ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీన్ని బ్యాటరీల తయారీలో, కెమికల్స్‌లో ఎక్కువగా వినియోగిస్తారు. సముద్రగర్భాల్లో ఎక్కువగా దొరికే అవకాశముంది. అలాంటిది మన దగ్గర ఉండడం గొప్ప విషయమే. దీన్ని అవసరానికి తగ్గట్టుగానే వినియోగించుకోవాల్సి ఉంటుంది.

## ముద్రగడ కోవర్టా...



కాకినాడ, ఫిబ్రవరి 7 )కాపుల సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమించిన ముద్రగడ పద్మనాభం ఒంటరి అయినట్లే కనిపిస్తుంది. ఆయన స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదనిపిస్తుంది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్ కు రాసిన లేఖతో ఆయన బేలతనం ప్రదర్శించడం కాపు సామాజికవర్గంలో చర్చనీయాంశమైంది. ముద్రగడను ఎవరు ఎందుకు టార్గెట్ చేస్తున్నారన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సొంత సామాజికవర్గం నేతలే ఆయనను కోవర్టుగా భావిస్తున్నారు. ముద్రగడ పద్మనాభం నాలుగు దశాబ్దాలున్న రాజకీయ నేత. నిబద్ధత, నిజాయితీ కలిగిన నేతగా పేరు పొందారు. ప్రయివేటు బస్సులకు అనుమతిచ్చిన వెంటనే ఆయన తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న నేతగా ఆయన ప్రజల మనసులో స్థానం సంపాదించుకున్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో మూడు దశాబ్దాలు పాటు ఆయన కాపు సామాజికవర్గం సంక్షేమం కోసమే పాటు పడ్డారు. అయితే 2014 ఎన్నికల తర్వాత నుంచి ముద్రగడ పద్మనాభంపై ఒత్తిడి మరింత ప్రారంభయింది. తుని సంఘటనను ఆయనను ఇబ్బంది పెట్టింది. కాపు రిజర్వేషన్ల కోసం కిర్లంపూడి లోనే దీక్షకు దిగారు. ఆయన దీక్షను భగ్నం చేయడంలో తనను, తన కుటుంబాన్ని అవమానపర్చారని మరింత వేదనకు గురయ్యారు. 2019 ఎన్నికలకు ముద్రగడ దూరంగానే ఉన్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియాలో ముద్రగడ పద్మనాభంపై ట్రోల్ ప్రారంభమయింది. కాపు జాతికి ద్రోహం చేస్తున్నారని కాపు సామాజిక వర్గం నుంచే ఆయనపై విమర్శలు మొదలయ్యాయి. అందుకే ఆయన కాపు రిజర్వేషన్ ఉద్యమం నుంచి పక్కకు తప్పుకున్నట్లు ప్రకటించారు కాపు రిజర్వేషన్ల ఉద్యమ సమయంలో నమోదయిన కేసులను ఏపీ ప్రభుత్వం ఎత్తివేయడాన్ని ఆయన స్వాగతించారు. జగన్ ను స్వయంగా కలసి కృతజ్ఞతలు తెలియజేయాలని ఉన్నా ట్రోలింగ్ కు భయపడి ముద్రగడ ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మరో వైపు కాపు నేతలంతా కలసి ఒక వేదికను ఏర్పాటు చే?సుకుంటున్నారు. దీనికి కూడా ముద్రగడను పక్కన పెట్టారు.

# వలస వస్తున్న ఆలివ్ తాబేళ్లు

కాకినాడ, ఫిబ్రవరి 7, (అలసట లేని వలస జీవులవి. అలుపెరుగని ప్రయాణం వాటి జీవన శైలి. సైబీరియా పక్షుల మాదిరిగా కేవలం సంతానోత్పత్తి కోసమే వేల కిలోమీటర్లు ప్రయాణించి పుట్టింటికి వచ్చినట్టుగా 'తూర్పు' తీరానికి చేరుకుంటాయి. ఎన్నో విశేషాలకు నిలయమైన ఆ జీవులు ఆలివ్ రిడ్లే తాబేళు ్లు. ప్రస్తుతం సంతానోత్పత్తి కాలం కావడంతో జిల్లాలోని సముద్ర తీరంలో సందడి చేస్తున్న ఈ తాబేళ్ల రక్షణకు అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.అరుదైన ఉభయచర జీవుల్లో అనేక జాతుల తాబేళ్లున్నప్పటికీ ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. వీటికి స్థిర నివాసం అంటూ ఏదీ ఉండదు. రెండడుగుల పొడవు, సుమారు 500 కేజీల బరువు ఉండే ఈ తాబేళ్లు ఆహారాన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం దాదాపు 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వీటిల్లో 7 జాతులుండగా 5 జాతుల తాబేళ్లు జపాన్, ఆ?రస్టేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి లక్షలాదిగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తీరాలకు సముద్ర మార్గంలో వలస వస్తాంటాయి.నదులు సముద్రంలో కలిసే చోటు వీటి సంతానోత్పత్తికి అనువుగా ఉంటుంది. అందుకే కాకినాడ సమీపంలోని ఉప్పాడ, హోప్ ఐలాండ్, కోరంగి అభయారణ్య తీర ప్రాంతానికి ఈ తాబేళ్లు ఎక్కువగా వస్తాంటాయి. జీవనం అంతా సముద్రంలోనే అయినప్పటికీ కేవలం గుడ్లు పెట్టడానికి భూమి మీదకు వచ్చేవి ఆలివ్ రిడ్లే తాబేళ్లు మాత్రమే. వేల కిలోమీటర్లు వలస వచ్చి గుడ్లు పెట్టిన చోటనే తయారైన పిల్లలు.. తిరిగి పదేళ్ల తరువాత సంతానోత్పత్తి సమయంలో తిరిగి అదే చోటుకు వచ్చి గుడ్లు పెట్టడం విశేషం. ఈ విధంగా పుట్టిన చోటుకే వచ్చి, మళ్లీ అక్కడే గుడ్లు పెట్టేది ఒక్క సముద్ర తాబేలు మాత్రమే.ఇవి జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి 'తూర్పు' తీరానికి వేలాదిగా వస్తాయి. అర్ధరాత్రి 2 నుంచి తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఆయా తీరాలకు చేరి, ఇసుకలో గోతులు తవ్విన, వాటిల్లో గుడ్లు పెట్టి, తిరిగి వాటిపై ఇసుక కప్పి, తల్లి తాబేళ్లు సముద్రంలోకి తిరిగి వెళ్లిపోతాయి. సుమారు నెల రోజుల అనంతరం ఈ గుడ్లు పిల్లలుగా తయారవుతాయి.ఒక్కో తాబేలు 50 నుంచి 150 వరకూ గుడ్లు పెడతాయి. 28 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో పొదిగిన గుడ్లు మగ తాబేళ్లుగాను, 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగాను తయారవు తాయి. వెన్నెల రాత్రుల వేళ ఆ పిల్లలు కూడా వాటంతట అవే సముద్రంలోకి వెళ్లిపోవడం మరో విశేషం. భారీ సైజులో ఉండే సముద్ర తాబేళ్లకు తీరంలో రక్షణ కరువవుతోంది. కుక్కలు, నక్కలు, ఇతర జంతువులు వీటి గుడ్లను తినేస్తుంటాయి. చివరకు కొన్ని మాత్రమే పిల్లలుగా తయారై వాటంతటవే సముద్రంలోకి వెళ్లిపోతుంటాయి. కొన్నిసార్లు ఆ పిల్లలను కూడా కొన్ని జంతువులు వేటాడి తినేస్తుంటాయి. ఇలా పుట్టినప్పటి నుంచీ సముద్ర తాబేళ్లకు ప్రాణసంకటంగానే ఉంటుంది. గుడ్లు పెట్టడానికి తీరానికి వచ్చిన తాబేళ్లు ఒక్కోసారి మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. వాటిని జాగ్రత్తగా సముద్రంలో వదిలేయాల్సిన కొంతమంది విచక్షణారహితంగా వ్యవహరించడంతో అవి మృత్యువాత పడుతుంటాయి. రాత్రి సమయాల్లో గుడ్లు పొదిగేందుకు వచ్చిన తాబేళ్లను కూడా వివిధ జంతువులు వేటాడి చంపుతుంటాయి. ఈవిధంగా ఏటా ఉప్పాడ తీరంలో అనేక తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి.జనవరి, ఫిబ్రవరి నెలలు సముద్ర తాబేళ్లకు సంతానోత్పత్తి సమయం. దీంతో ఇక్కడకు వస్తున్న తాబేళ్లకు రక్షణ కల్పిస్తున్నాం. అవి సంచరించే ప్రాంతాన్ని సంరక్షణ ప్రాంతంగా నిర్ణయించి, బోర్డులు ఏర్పాటు చేసి, ప్రత్యేక కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. అవి గుడ్లు పెట్టే ప్రాంతాల్లో జనసంచారం లేకుండా చూస్తున్నాం. గుడ్లు పొదిగి పిల్లలయ్యేంత వరకూ సుమారు 40 రోజుల పాటు రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నాం. తాబేళ్లను, వాటి గుడ్లను ఏ జంతువులూ తినకుండా రక్షణ కలి?పస్తున్నాం. తయారైన పిల్లలు సురక్షితంగా సముద్రంలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. తాళ్లరేవు సమీపంలోని కోరింగ అభయారణ్యం ప్రాంతానికి సుమారు లక్ష వరకూ తాబేళ్లు వచ్చే అవకాశాలున్నాయి. ఉప్పాడ, కాకినాడ తదితర ప్రాంతాల్లో కొన్ని పరిస్థితుల వల్ల బోట్లలో పడి కొన్ని తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. వాటి రక్షణకు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు.

## రెండు రోజుల్లో ఇంటర్ షెడ్యూల్

హైదరాబాద్, ఫిబ్రవరి 7, కరోనా కారణంగా  గత రెండు అకడమిక్స్ ఇయర్స్‌లో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. కరోనా కేసులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలు పరీక్షలను రద్దు చేస్తూ విద్యార్థులను ప్రమోట్ చేస్తూ వచ్చాయి. ఇదిలా ఉంటే తెలంగాణలో ఈసారి కూడా ప్రాక్టికల్స్ ఉండవన్నట్లు గత కొన్ని రోజులుగా చర్చ జరుగుతోంది. కొన్ని పత్రికల్లో కూడా ఈసారి కూడా ప్రాక్టికల్స్ నిర్వహణ సందేహం అన్నట్లు వార్త కథనాలు వచ్చాయి. దీంతో ఈ విషయంపై ఇంటర్ బోర్డ్ క్లారిటీ ఇచ్చింది.ఇంటర్ పరీక్షలపై జరుగుతోన్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టిన ఇంటర్ బోర్డ్ క్లారిటీ ఇచ్చేసింది. ఈసారి పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో నిర్వహిస్తామని తేల్చి చెప్పేసింది. ఈ విషయమై అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 'గతేడాది కరోనా కారణంగా భౌతికంగా తరగతులు నిర్వహించలేదు, కేవలం 45 రోజులు మాత్రమే తరగుతులు జరిగాయి. ఈ కారణంగానే పరీక్షలు లేకుండానే విద్యార్థులను ప్రమోట్ చేయాల్సి వచ్చింది. అయితే 2021-2022 అకడమిక్ ఇయర్‌లో పరిస్థిలో మార్పు వచ్చింది. జనవరిలో కేవలం 14 రోజులు మాత్రమే కాలేజీలు మూతపడ్డాయి. ఫిబ్రవరి 1 నుంచి యథాతథంగా తరగతులు కొనసాగుతున్నాయి.వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న నేపథ్యంలో ప్రాక్టికల్ పరీక్షలను ఎప్పటిలాగే థియరీ పరీక్షలకు ముందే నిర్వహించనున్నాము. పరీక్షలను నిర్వహించకుండానే ప్రమోట్ చేసే ఆలోచనే లేదు. ప్రాక్టికల్, థియరీ పరీక్షల షెడ్యూల్‌ను ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయనున్నాము. విద్యార్థులంతా ఈ విషయాన్ని గమనించాలి' అంటూ తెలంగాణ బోర్డ్ స్పష్టతనిచ్చింది.

డిగ్రీలోనూ అడిషనల్ చాయిస్

రాష్ట్రంలోని 6 యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ స్టూడెంట్లకు ఈనెల 28 నుంచి ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. శనివారం ఉస్మానియా, కాకతీయ, టీయూ, ఎంజీయూ, శాతవాహన, పాలమూరు తదితర వర్సిటీల వీసీలతో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ఆర్.లింబాద్రి, వైస్? చైర్మన్?వెంకటరమణ వర్చువల్‌గా సమావేశమయ్యారు. కరోనా కారణంగా స్టూడెంట్స్‌లో ఎగ్జామ్స్?పట్ల ఏర్పడిన భయాన్ని తొలగించేందుకు ఎగ్జామ్ పేపర్లలో చాయిస్ పెంచాలని నిర్ణయించామని లింబాద్రి తెలిపారు. పరీక్షా సమయాన్ని రెండున్నర గంటల నుంచి 3 గంటలకు పెంచనున్నట్టు వివరించారు. ఈనెల17 లాస్ట్ టీచింగ్ డే అని, 18 నుంచి 25 వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జరుగుతాయని అన్నారు. ఈనెల 28 నుంచి మార్చి 24 వరకు డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ థియరీ పరీక్షలుంటాయని చెప్పారు.వివిధ వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మరో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు టీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ లింబాద్రి తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

## తెరపైకి ధర్మవరం రెవెన్యూ డివిజన్

అనంతపురం, ఫిబ్రవరి 7, (న్యూస్ పల్స్)అనంతపురంలో జిల్లాల విభజన అంశం మరో రచ్చకు తెరతీసింది. ధర్మవరం రెవిన్యూ డివిజన్‌ను రద్దు చేయడంతో పొలిటికల్ వార్ మొదలైంది. దీనిపై ఆందోళనకు సిద్ధమవుతున్నారు టీడీపీ నేతలు. ఇవాళ ధర్మవరంలో నిరాహారదీక్షకు దిగుతున్నారు పరిటాల శ్రీరామ్. ధర్మవరం డివిజన్ రద్దు చేస్తుంటే ఇక్కడున్న వైసీపీ నేతలు ఏం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు పరిటాల శ్రీరామ్. గాడిదలు కాస్తున్నారా ? అని ఇటీవల కామెంట్ చేశారు. దీనిపై వైసీపీ నేతలు మండిపడుతున్నారు. పరిటాల శ్రీరామ్‌కు అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలపై వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మార్వో ఆఫీసులు తగులబెట్టిన వారు కూడా రెవెన్యూ డివిజన్ అంశాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అయితే పరిటాల శ్రీరామ్ నిరాహార దీక్షతో ధర్మవరంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మరోవైపు ఇదే అంశంపై జిల్లా కలెక్టర్‌ను కలువబోతున్నారు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ. దీంతో ధర్మవరం రెవెన్యూ డివిజన్ రద్దు అంశం పెద్ద దుమారాన్నే రేపుతోంది.ధర్మవరం రెవెన్యూ డివిజన్‌ను రద్దు చేసి కొత్త జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పాటుకానున్న పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోకి విలీనం చేస్తూ జగన్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 1953లో ధర్మవరం రెవెన్యూ డివిజన్ ఫామ్ అయ్యింది. ధర్మవరం, పెనుకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలోని 17 మండలాలు దీని సర్కిల్‌లో ఉండేవి. అయితే 2013లో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ ఫామ్ చెయ్యడంతో అందులోకి కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల మండలాలు వెళ్లాయి. దీంతో ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలతో డివిజన్ కొనసాగింది. ఇటీవల సత్యసాయి జిల్లా ప్రకటనతో అనంతపురం రెవెన్యూ డివిజన్‌లోకి రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు యాడ్ చేశారు. రామగిరి మండలాన్ని కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోకి ఛేంజ్ చేశారు. ధర్మవరం నియోజకవర్గంలోని 4 మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతుందని అనకుంటుండగా? డివిజన్ రద్దు చేస్తూ గవర్నమెంట్ ఉత్తర్వులు  వెలువరించింది.

## ఉద్యోగ నాయకులు అమ్ముడుపోయారా..?

అమరావతి ఫిబ్రవరి 7 ;ఏపీలో ఉద్యోగుల ఆందోళన గత కొంతకాలంగా సాగుతూ వచ్చింది. దానికి పరాకాష్టగా చలో విజయవాడ కార్యక్రమం నిలిచింది. ఈ కార్యక్రమం  అయితే ఏపీ మొత్తాన్ని ఆకర్షించింది. లక్షలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులు పదమూడు జిల్లాల నుంచి బెజవాడ వీధులకు తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియచేయడం అంటే వైసీపీ సర్కార్ కూసాలు కదిలిపోయినట్లే  అని అనుకున్నారు.ఇది సమ్మె సన్నాహక నిరసన సభే ఈ రేంజిలో సాగితే సమ్మె ఎలా ఉంటుందో అన్న ఉత్కంఠ కూడా అందరిలో కలిగింది. నిజంగా సమ్మె జరిగితే మాత్రం అది ఇక ఏపీలోనే అతి పెద్ద  రికార్డుగా ఉండేది. కానీ పరిస్థితి అంతవరకూ రానీయకుండా ప్రభుత్వం చాకచక్యంగా వ్యవహరించింది. ఇటు ఉద్యోగులు కూడా చర్చలకు వచ్చారు. ఇలా కొన్ని గంటల పాటు సాగిన చర్చల సారాంశం మేరకు కథ సుఖాంతం అయింది.ఫిట్మెంట్ విషయంలో ప్రభుత్వం తగ్గకపోయినా చాలా డిమాండ్లను నెరవేర్చింది అని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చెప్పారు. అయితే సరిగ్గా ఇక్కడే ఉపాధ్యాయ సంఘాలు మాత్రం పూర్తి స్థాయిలో విభేదించాయి. కొత్త పీయార్సీ తమకు సమ్మతం కాదని తెగేసి చెప్పేశాయి. తమకు తీరని అన్యాయమే జరిగింది అని కూడా హాట్ కామెంట్స్ చేశాయి.గ్రామీణ ప్రాంతాలలోని ఉపాధ్యాయులకు ఇంటి అద్దె అలవెన్స్ ఇపుడు దారుణంగా తగ్గిపోయింది అని కూడా వాపోయారు. 27 శాతం ఫిట్మెంట్ ఇవ్వాల్సిందే అంటూ ఉపాధ్యాయులు శనివారం అర్ధరాత్రి నుంచే ఆందోళన చేపట్టాయి. ఆదివారం అంతా కూడా ఏపీలోని పదమూడు జిల్లాల్లో ఎటు చూసినా నిరసనలు చేస్తూ టీచర్లు  కనిపించారు.ఇక సోమవారం నుంచి తెల్లారుతూనే ఉపాధ్యాయులు నల్ల బాడ్జీలు ధరించి పాఠశాలలకు వచ్చారు. తాము ఉద్యమం పూర్తిగా కొనసాగిస్తామని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు  ఏకంగా తమ బాణాలను పీయార్సీ సాధన సమితి నేతల మీదకు ఎక్కు పెడుతున్నారు. నాయకులు కొందరు ప్రభుత్వానికి అమ్ముడు పోయారని అందుకే రివర్స్ పీయార్సీకి ఒప్పుకున్నారని తమ డిమాండ్లు ఏమీ పరిష్కారం కాకుండా సమ్మె విరమించారని కూడాడిపడుతున్నారు.లక్షలాదిఉపాధ్యాయులకు  అన్యాయం చేశారని కూడా వారు అంటున్నారు.ఇది నిజంగా ద్రోహం అని కూడా గట్టిగానే మాట్లాడుతున్నారు. ఉద్యోగులతో కలసి తాము పోరాటం చేయడమే తప్పు అని కూడా అంటున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ నుంచి బయటకు అచ్చి మరీ సొంతంగా తాము ఉద్యమిస్తామని చెబుతున్నారు. ప్రభుత్వంతో లాలూచీ పడ్డారని కూడా విమర్శిస్తున్నారు. ఇక ఉపాధ్యాయ సంఘాలు తమ నిరసనలో మంత్రుల కమిటీతో చేసుకున్న ఒప్పంద పత్రాలను కూడా దహనం చేయడం విశేషం.తమ డిమాండ్లు నెరవేరేవరకూ తాము ఎక్కడా తలొగ్గేది లేదని అంటున్నారు. ఉపాధ్యాయ సంఘాల్లో బలంగా ఉన్న ఏపీటీఎఫ్ యూటీఎఫ్ నేతలు అయితే ప్రభుత్వం కొత్త పీయార్సీలో అందరికీ అన్యాయమే చేసింది అంటున్నారు. ఇక పీయార్సీ సాధన కమిటీ నేతలు చలో విజయవాడతో వచ్చిన సంఘటితను పోరాటపటిమను సక్రమంగా ఉపయోగించుకోలేకపోయారని కూడా నిందిస్తున్నారు. ఇక సమ్మె విరమణ అంతా ఏకపక్షంగా సాగిందని దుమ్మెత్తిపోస్తున్నారు.అసలు పోరాటం అంటే ఏంటో తాము చూపిస్తామని కూడా వారు చెబుతున్నారు. మరి ఉపాధ్యాయుల విమర్శల మీద ఉద్యోగ సంఘ నేతలు ఏవరూ మాట్లాడకపోయినా వారు చేసినవి మాత్రం చాలా షాకింగ్ కామెంట్స్ గానే చూడాలి వీటిలో  అమ్ముడు పోయారు అన్న మాట అయితే దారుణమైనదే. మరి దీనికి ఉద్యోగ సంఘ నేతల తరపున ఎవరైనా రియాక్ట్ అవుతారో ఏమో చూడాల్సి ఉంది.

## టమాటా లోడ్ అనుకుంటే పొరబడినట్లే..

### లోపల చెక్ చేస్తే కళ్లు చెదిరాయి

తిరుపతి ఫిబ్రవరి 7 ( చిత్తూరు జిల్లాలో పుష్ప సీన్ వెలుగు చూసింది. ఎర్రచందనం స్మగ్లర్లు పుష్ప  సినిమా చూసి కొత్త ఐడియాలకు తెరతీశారు. అక్కడ హీరో తగ్గేదేలే అంటే.. అంతా విజిల్స్ వేశారు. కాని ఇక్కడ పుష్ప కటకటాలపాలయ్యాడు. ఇంతకీ ఏం జరిగిందంటే.. చంద్రగిరిలో టమాటా రవాణా ముసుగులో ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్‌కు దిగాడు ఓ దుండగుడు. పుష్ప సినిమాలో పాల వాహనంలో ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేసినట్లు.. ఇక్కడ టమాటా రవాణా ముసుగులో ఇలా చేశాడు. ట్రాలీలో కింద ఎర్రచందనం దుంగలను ఉంచి.. పైన టమాటా ట్రేలు పెట్టాడు. చెకింగ్ పాయింట్ దగ్గర పోలీసులకు అనుమానం రాకుండా చూసుకున్నా.. చివరికి దొరికిపోయాడు. మొత్తం 14 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లగేజీ వాహనంతో సహా దుంగలను చంద్రగిరి పోలీస్ స్టేషన్ కు తరలించారు. స్మగ్లర్ పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.కాగా  ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం.. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో ఉన్న శేషాచలం కొండల్లో మాత్రమే దొరుకుతుంది. శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనంలో ఎక్కువ క్వాలిటీ ఉండడంతో దానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.  జపాన్, చైనా, రష్యాలలో ఎర్ర చందననాన్ని వివిధ రూపాల్లో వినియోగిస్తుంటారు. చైనా, జపాన్‌లలో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలు కూడా ఎర్రచందనంతో చేసినవి వాడుతుంటారు. సంగీత వాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్ల లో బహుమతిగా ఇస్తుంటారు.  విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను క్యాష్ చేసుకోవడానికి స్మగ్లర్లు అనేక మార్గాల్లో ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారు.

## కలెక్టరేట్ ముందు అశా వర్కర్ల నిరసన

కాకినాడ కాకినాడలోని కలెక్టర్ కార్యాలయానికి ఆశా కార్యకర్తలు ర్యాలీగా దూసుకువచ్చారు.  జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీగా ఉన్న పోలీసులను తోసుకుంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరకున్నారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. అందోళనకారులను పోలీసులు బలవంతంగా అడ్డుకున్నారు.. వ్యాన్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆశా కార్యకర్తలను  తరలించారు

## మరణించిన ఆశాలకు న్యాయమడిగితే అరెస్టులా ?

కాకినాడ  విధినిర్వహణలో కరోన బారిన పడి  మరణించిన ఆశాల కుటుంబ సభ్యులకే ఖాళీ పోస్టులు కేటాయించాలని, వారి కుటుంబాలకు 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు 50శాతం వేతనాలు పెంచాలని, మిగులు సిబ్బంది పేరుతో గతంలో తొలగించిన వారినే ఖాలిపోస్టులలో నియమించాలని, కార్మిక చట్టాలప్రకారం సెలవులు మంజూరు చేయాలని, పని ఒత్తిడి తగ్గించి , ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఛలో కలక్టరేట్ కు తరలి వచ్చిన వేలాది ఆశా కార్యకర్తలను పోలీసులు ద్వారా జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయించడం సిగ్గుచేటని సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి విమర్శించారు.వివరాలలోకి వెళితే గత రెండు సంవత్సరాలుగా కరోన సంక్షోభంలో ఫ్రంట్ లైన్ వర్కర్లుగా ప్రజలకు సేవలందిస్తూ కరోన బారిన పడి జిల్లాలో 16 మంది ఆశా కార్యకర్తల చనిపోయారు. వీరిలో ఏ ఒక్కరి కుటుంబానికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన 50 లక్షల ఇన్సూరెన్స్ ఇప్పటికి చెల్లించలేదు. గతంలో ఆరు వందల నెల జీతానికి పనిచేసిన ఆశాలను మిగులు సిబ్బంది పేరుతో 30 మందిని తొలగిస్తూ ఆశా పోస్టుల నియామకంలో మీకే ప్రాధాన్యత ఇస్తామని చెప్పి, ఇప్పుడు రాజకీయ ఒత్తిడులు ఉన్నాయని ఖాళీ పోస్టులను దొడ్డిదారిన కొత్తవారిని నియమించడం అన్యాయమని నినదించారు. మరోపక్క చనిపోయిన ఆశాల స్థానంలో వారి కుటుంబసభ్యులకు కాకుండా రహస్యంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న  అధికారులను ఆశా కార్యకర్తలు అడ్డుకుని ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. జిల్లా అధికారులు ఆశాల న్యాయమైన కోర్కెలను పట్టించుకోకపోవడంతో 5వతేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నాలకు, 7వతేది ఛలో కలక్టరేట్ పిలుపునివ్వడం జరిగింది. పెద్దఎత్తున ఆశా కార్యకర్తల కదిలివస్తున్న నేపథ్యంలో అధికారులు ఆశా సంఘ జిల్లా గౌరవ అధ్యక్షురాలైన జి.బేబిరాణిని, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సీఐటీయూ నగర అధ్యక్షులైన పలివేల వీరబాబులను మరియు ఆశా జిల్లా నాయకులను గృహ నిర్బంధం చేశారు. కాకినాడ ధర్నా చౌక్ ప్రాంతానికి ఆశాలు చేరుకోకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు అడ్డుపెట్టి సామర్లకోట (40మంది), పిఠాపురం (70 మంది), కరప (34 మంది), పెదపూడి (45 మంది), అమలాపురం (300 మంది) జిల్లా పరిషత్ ప్రాంతాలలో ఆందోళనకు వస్తున్న ఆశా కార్యకర్తలను అడ్డుకుని స్టేషన్లకు తరలించారు. ఎక్కడికక్కడే అరెస్టులకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్లోనే ధర్నాలు నిర్వహించారు. మిగిలిన ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున సుందరయ్య భవన్ కు చేరుకుని ర్యాలీగా కలక్టరేట్ బయలుదేరడంతో ర్యాలీకి నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి,కోశాధికారి మలక రమణ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్సులు చంద్రమళ్ల పద్మ, ఈశ్వరి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, చంద్రావతి లను బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్ లో పోర్ట్ స్టేషన్ (35మంది), ఇంద్రపాలెం (20 మంది) పోలీస్ స్టేషన్లకు తరలించడంతో ర్యాలీలో మిగిలిన ఆశాలు కాకినాడ కలక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేయాలని వెళుతుండగా పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి మిగిలిన ఆశాలను బలవంతంగా వ్యాన్ లలో స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు ఆశా కార్యకర్తలు గాయాలపాలయ్యారు. పోలీసులు దురుసుగా వ్యవహరిస్తూ మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు ఆశా కార్యకర్తపై చేయి చేయిచేసుకున్నారని ఆరోపించారు. అరెస్టులు చేయగా మిగిలిన ఆశా కార్యకర్తల ధర్నా చౌక్ లో జిల్లా అధికారులు ఖాలిపోస్టులు చనిపోయిన ఆశాలకే కేటాయించాలని ఆందోళనను కొనసాగిస్తూ  జిల్లా అధికారి శ్రీనివాస్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ఇక్కడితో ఆగదని సమస్య పరిష్కరించకపోతే రోజువారీ ఆందోళనలకు దిగుతామని బేబిరాణి హెచ్చరించారు.ఈ పోరాట కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, పెద్దాపురం సీఐటీయూ నాయకులు క్రాంతి, నూకల బలరాం, మెడిశెట్టి వెంకటరమణ, ఆశా సంఘం జిల్లా నాయకులు లలిత, లీల, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తో చిరంజీవి భేటీ

## ఆయన పర్సనల్.. మంచు విష్ణు

, తిరుపతి ఫిబ్రవరి 7 ()టికెట్ల ధరలపై సినీ ఇండస్ట్రీ ఏకతాటిపైకి రావాలన్నారు మంచు విష్ణు. ఇప్పటికే అన్ని చాంబర్స్‌తో మంతనాలు జరుగుతున్నాయన్నారు. రెండు ప్రభుత్వాలతోనూ టికెట్ ధరల విషయంపై చర్చలు జరగాలన్నారు. అయితే చాంబర్స్ మధ్య విభేదాలే చర్చల్లో సాగదీతకు కారణమని విష్ణు మాటల్లో తెలుస్తోంది. సీఎం జగన్‌తో మెగాస్టార్ చిరంజీవి భేటీ ఆయన వ్యక్తిగతం అంటూ సంచలన కామెంట్స్ చేశారు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు. దానికీ, ఇండస్ట్రీకి ముడిపెట్టొద్దన్నారు. ఈ భేటీలపై వ్యక్తిగతంగా తన అభిప్రాయంతో పనిలేదన్నారు. రెండు ప్రభుత్వాలు ఇండస్ట్రీని ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. గతంలో వచ్చిన జీవోలు తీసేసిన జీవోలపై ముందు మాట్లాడాలని.. ఆతర్వాతే ప్రస్తుత జీవోలపై మాట్లాడాలన్నారు మంచు విష్ణు. మా' అసోసియేషన్ 100 రోజుల ప్రగతిపై త్వరలో మీడియాతో మాట్లాడతానన్నారు.  చివరగా తనను విమర్శిస్తున్నారంటే తాను పాపులర్ అని అర్థం అంటూ పంచ్ పేల్చారు విష్ణు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో   చిరంజీవి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల భేటీ అయ్యారు. చిరంజీవి,  జగన్ మధ్య మర్యాదపూర్వక లంచ్ భేటీ జరిగింది. తెలుగు సినీ ఇండస్ట్రీకి సంబంధించిన పలు అంశాలు ఈ భేటీలో చర్చించారు. తాను ఇండస్ట్రీ తరపున సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వచ్చానని చిరంజీవి అప్పుడు పేర్కొన్నారు. ఏపీ సీఎం జగన్ ఆహ్వానం మేరకు తాను తాడేపల్లికి వచ్చినట్లు మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. కాగా ఈ మీటింగ్ అనంతరం వైసీపీ చిరుకు రాజ్యసభ సీటు ఇస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ వార్తలను పూర్తిగా ఖండించారు మెగాస్టార్. రాజకీయాలకు తాను పూర్తిగా రాజకీయాలకు దూరమైనట్లు స్పష్టం చేశారు. ఆ వార్తలు స్పెక్యులేషన్ అని కొట్టిపారేశారు.

## 51వ డివిజన్ లో మంత్రి వెల్లంపల్లి పర్యటన

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 51వ. డివిజన్ లో ఇంటింటికి తిరిగి వారి  సమస్యలనుదేవాదాయశాఖ మంత్రి వెల్లపల్లి శ్రీనివాసరావు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మున్సిపల్ అధికారులు పాల్గోన్నారు. మంత్రి వెల్లంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా, వైద్య రంగాల పై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సీఎం జగన్ రూ.12 కోట్లలు మంజూరు చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోంది.  పనికిమాలిన పవన్ కళ్యాణ్ మాటలు రాష్ట్ర ప్రజలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉద్యోగస్తుల సమస్యను సీఎం జగన్ పరిష్కరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఏబీఎన్ రాధాకృష్ణ సీఎం జగన్ పాలన చూసి ఓర్చుకోలేక పోతున్నారు. దిక్కుమాలిన రాజకీయాలు చేసే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రాధాకృష్ణ ఎప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలి. చంద్రబాబు ప్రభుత్వంలో ఉద్యోగస్తులు సమ్మె చేస్తే పట్టించుకున్న సందర్భాలు లేవు.. పేమెంట్ ఆర్టిస్ట్ పవన్ కళ్యాణ్ అని అన్నారు. పక్క రాష్ట్రంలో ఉండి ఆంధ్ర రాష్ట్రం గురించి మాట్లాడే నైతిక హక్కు పవన్ కళ్యాణ్ లేదని మంత్రి వ్యాఖ్యానించారు.

## సిఐటీయూ నిరసన

విశాఖపట్నం పిఆర్సి  ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ సిఐటియు తలపెట్టిన నిరసన ఉద్రిక్తతలకు దారితీసింది. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద జరిగిన అరెస్టులు ఉద్రిక్త వాతావరణం తలపించాయి. ఉద్యోగ సంఘాల నాయకులతో జరిగిన ఒప్పందాలు తమకు అన్యాయం జరిగిందని పారిశుధ్య కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయాలని ప్రయత్నించారు. అయితే పోలీసులు వారికి అనుమతి నిరాకరించారు. దీంతో ఒక్కసారిగా జీవీఎంసీ అవుట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు రోడ్లపైకి వచ్చి బైఠాయించి నిరసన తెలియజేశారు. దీంతో అక్కడే మోహరించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## నాలుగు హత్యలుచేసిన హంతకుడు ఆరెస్టు

ఒంగోలు ప్రకాశం జిల్లా టంగుటూరులో నలుగురిని కత్తులతో పొడిచి గొంతులు కోసి హత్యలు చేసిన ఇద్దరు నరరూప రాక్షసులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి దగ్గర నుంచి 30 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు నెలల క్రితం జరిగిన తల్లీకూతుళ్ల జంట హత్య కేసు దర్యాప్తులో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగుచూశాయి. నాలుగేళ్లక్రితం ఇదే తరహాలో చీమకుర్తి లో జరిగిన భార్యాభర్తల జంట హత్య కేసులో కూడా టంగుటూరు జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడు శివకోటయ్య నిందితుడుగా ఉన్నట్టు గుర్తించారు. అంతేకాకుండా టంగుటూరులోనే ఇటీవల బంగారం షాపులో దోపిడీ చేసి దాదపు కేజీ బంగారం దోచుకెళ్లిన కేసులో శివకోటయ్య నిందితుడిగా తేల్చారు.ఇప్పటివరకు వీరు నేరాలకు, హత్యలకు పాల్పడిన 6 కేసుల్లో 30 లక్షల విలువైన బంగారం, వెండి నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శివకోటయ్యతో పాటు జరుగుమల్లికి చెందిన నరేష్ నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శివకోటయ్య గతంలో ఇద్దరు మహిళలను తీవ్రంగా గాయపర్చి ఒంటిపై నగలు ఎత్తుకెళ్లిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అలాగే పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు.టంగుటూరులో అత్యంత కిరాతకంగా తల్లీకూతుళ్లు శ్రీదేవి, మేఘనలు హత్య గురి కావడంతో ఇతర రాష్ట్రాల దోపిడీ ముఠాల పనిగా భావించిన పోలీసులు రెండు నెలలు పాటు జల్లెడ పట్టారు. చివరికి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు జంట హత్యలకు ముందు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. హత్యలకు ముందు నాలుగురోజుల పాటు రెక్కీ నిర్వహించారు. అనంతరం ఇంట్లో బీరువాలో ఉన్న బంగారం కోసం వెళ్లి శ్రీదేవి ఆమె కుమార్తె మేఘనలు తిరగబడటంతో వారిని దారుణంగా ఇరవైకి పైగా కత్తిపోట్లు పొడిచారు. నిందితుల్లో నరేష్ అనే యువకుడు మహిళలపై పెప్పర్ చల్లుతుండగా ప్రధాన నిందితుడు శివకోటయ్య కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. అనంతరం గొంతుకోసి హత్య చేశారు.వారి వద్ద ఉన్న బంగారం అపహరించుకెళ్లారు. వేలిముద్రలతో పాటు కాల్‌డేటా ఆధారంగా విచారణ జరిపిన పోలీసు అధికారులు సీసీ కెమెరాల్లో దొరికిన ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించడంతో వీరిద్దరి గుట్టు రట్టయింది. ఎస్పీ మలిక గార్గ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి స్వీయ పర్యవేక్షణ చేశారు.

# పెంచిన వేతనాలు వెంటనే ఇవ్వాలి

## ఏఐటీయూసీ

నంద్యాల ఫిబ్రవరి 7, (( విభారె) :- :- కోవెలకుంట్ల లో సోమవారం నాడు కోవెలకుంట్ల ప్రభుత్వ హాస్పిటల్ లో సెక్యూరిటీ శానిటేషన్ వర్కర్లకు పెంచిన వేతనాలు జీవో నెంబర్ 549 ప్రకారం 16 వేల రూపాయల జీతం ఇవ్వాలని అలాగే పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ కోయిలకుంట్ల ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఏఐటీయూసీ ఆధ్వర్యంలో




ధర్నా నిర్వహించడం జరిగిందని పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్యదర్శి డి శ్రీనివాసులు మాట్లాడుతూ కోయిలకుంట్ల ప్రభుత్వ హాస్పటల్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ శానిటేషన్ వర్కర్స్ జీతాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి కుటుంబాలు గడవడం కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి జీవో నెంబర్ 549 ప్రకారము 16 వేల వేతనం ఇవ్వాలని పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని అలాగే వారికి సౌకర్యం కల్పించాలని అలాగే హాస్పిటల్లో సిబ్బంది కొరత ఉందని సిబ్బంది కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బమ్మ సుధారాణి సోనియా కళ్యాణి నాగలక్ష్మి వెంకటలక్ష్మమ్మ దస్తగిరి రఫీ బాల శేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా కు ఏపిజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలి




నంద్యాల ఫిబ్రవరి 7, (( విభారె) :- :- నంద్యాల జిల్లాకు ఏపీజే అబ్దుల్ కలాం పేరు ప్రతిపాదించాలని ఏపీజే అబ్దుల్ కలాం జిల్లా సాధన కమిటీ గాంధీచౌక్ వద్ద సోమవారం నాడు విలేకరుల తో మాట్లాడుతూ కులాలకు అతీతంగా దేశానికి సేవ చేసిన ఏపీజే అబ్దుల్ కలాం యువతకు మార్గదర్శకంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకునే విధంగా నంద్యాల జిల్లాకు ఆయన పేరు పెట్టాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కొన్ని కొత్త జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వందే అని అన్నారు. అనంతరం ఏపిజే అబ్దుల్ కలామ్ జిల్లా సాధన కమిటీ కన్వీనర్ ఆకుమల్లా రహీమ్ మాట్లాడుతూ అందరికీ ఆదర్శప్రాయుడు కులమతాలకు అతీతంగా దేశ సేవ చేసిన ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలని దేశ ప్రజలందరూ మన వైపు చూసే విధంగా ఆయన పేరును ప్రతిపాదించాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అలాగే వాజ్ పేయి ప్రభుత్వం లో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. అన్ని ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు రాజకీయ పార్టీలు ఏపీజే అబ్దుల్ కలాం పేరును నంద్యాల జిల్లాకు పేటేందుకు ఒక తాటి పైకి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏపీజే అబ్దుల్ కలాం సాధన కమిటీ కన్వీనర్ ఆకుమల్లా రహీమ్, కో కన్వీనర్ జి.యమ్.గౌస్,కో కన్వీనర్ చిరు వ్యాపారులు సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యనారాయణ , మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి వహీదా,వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరమ్ రాష్ట్ర కో కన్వీనర్ జావేద్, జానో జాగో జాతీయ కార్యదర్శి మహబూబ్ బాషా, గున్నీ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి హబీబుల్లా,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కరీం,వికలాంగుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీపీ మస్తాన్ వలీ,ఏపీయూడబ్ల్యూజే డిస్ట్రిక్ట్ కమిటీ మెంబర్ ఉస్మాన్ బాషా,కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి రహేమాన్ వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల పట్టణం అధ్యక్షులు అలీం, జమియత్ ఇస్లామిక్ హింద్ నవాజ్ ఖాన్,ముస్లిం స్వర్ణ కార సంఘం జిల్లా అధ్యక్షుడు ఫాయాజ్, ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నంద్యాల పట్టణ ఉపాధ్యక్షుడు నబి రసూల్,ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఉపాధ్యక్షులు సయ్యద్ సౌదగర్ అసదుల్లా మియా,అల్ మధత్ ఫౌండేషన్ సభ్యులు నూనేపల్లి చాంద్ భాష, అబ్దుల్లా,చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవ సలహదారు నభిరసూల్,చిరు వ్యాపారులు సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శులు, ఎన్.జె చంద్ర పాల్, తిరుమలేష్ ,గన్ని మర్చంట్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యుల ముహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవల పై రైతులకు అవగాహన సదస్సు

## వ్యవసాయ అధికారి శివశంకర్



మంత్రాలయం ఫిబ్రవరి 7, (( విభారె): బ్యాంకింగ్ సేవలపై రైతులకు అవగాహన కల్పించినట్లు వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బసాపురం రాంపురం మరియు కాచా పురం గ్రామాలలో రైతులకు బ్యాంకింగ్ సేవల పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి రైతు, రైతు భరోసా కేంద్రాలలో బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిజినెస్ కరస్పాండెంట్ బ్యాంకు సేవలు అందజేస్తారు. ముఖ్యంగా పంట రుణాలు బంగారు ఆభరణాలపై రుణాలు చదువుకోవడానికి లోన్స్ ఇస్తున్నట్లు తెలిపారు.మండల కన్వీనర్ బీమి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాఘవరెడ్డి నరసింహులు దినేష్ శేఖర్ రాఘవేంద్ర హైమావతి రైతులు తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు వరం

## శాసనసభ్యులు వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం ఫిబ్రవరి 7, (( విభారె) :- : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ యంత్రసేవ పథకం రైతులకు వరం లాంటిదని మంత్రాలయం నియోజకవర్గం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో మండలంలోని సాతనూరు గ్రామంకు యంత్రసేవ పథకం కింద శ్రీ రామలింగేశ్వర స్వామి రైతు మిత్ర గ్రూపుకు మంజూరైన ట్రాక్టర్ ను లబ్దిదారులకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిగారి పంపిణీ



చేశారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాక్టర్ ను నడిపి రైతులను ఉత్సాహోవరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజు,కోసిగి మండల ఇంచార్జ్ మురళీమోహన్ రెడ్డి,బసాపురం బీమిరెడ్డి,పెద్ద కడుబూరు రవిచంద్ర రెడ్డి సాతనూరు చంద్ర,బసాపురం సర్పంచ్ రాఘవరెడ్డి,జాన్, మధ్రిస్వామి,యంపిఈఓలు రమేష్,హానుమంతు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన కు 15 వినతులు

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాల ఫిబ్రవరి 7, (( విభారె) నంద్యాల ఉదయం న్యూస్ :-స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందినాయి అని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం లో స్పందన కార్యక్రమము నిర్వహించారు. ఈకార్యక్రమం లో నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. కోవిడ్ నిబంధనలు పాటించుచు వినతిదారుల నుండి వినతులు స్వీకరించారు.అనంతరం సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో విన్నవించే విన్న తులలో విన్నతి దారుల ఆధార్ కార్డు నెంబరు మరియు సెల్ ఫోన్ నెంబర్లు ఖచ్చితంగా నమోదు చేయాలి అని అన్నారు. కరోనా వైరస్ ఒమిక్రాన్ వేరియంట్ విస్తరిస్తున్న నేపథ్యంలో కోవిడ్-19 నిబంధనలను ప్రజలంతా ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు..సామాజిక దూరం పాటించడంతో పాటు, తరచుగా చేతులను శుభ్రపరచుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.బహిరంగ ప్రదేశాల్లో మాస్కు ధరించని వారికి రూ.100 జరిమానా . వాణిజ్య, వ్యాపార సంస్థలు, దుకాణాల్లో మాస్కులు ధరించని వారిని అనుమతించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు, వాణిజ్య ప్రదేశాలకు రూ.10 వేల నుండి 25 వేల వరకు జరిమానా విధించాలని స్పష్టం చేశారు..సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కోవిడ్ నిబంధనలు పాటించుతూ వినతిదారుల నుండి వినతులు స్వీకరించినామని అన్నారు. వినతి దారులకు ముఖ్యంగా తెలియజేయడమేమనగా మీ పరిధిలోని సచివాలయం నందు మరియు మండల తహశీల్దార్ వారి కార్యాలయం నందు కూడా వినతులు స్వీకరించబడతాయి అక్కడ పరిష్కారం దొరకనప్పుడు మాత్రమే డివిజన్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయం నకు రావాలన్నారు .సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఎక్కువ శాతం భూ తగాదాల గురించి. భూములను ఆన్లైన్లో నమోదు చేయించాలని. భూములను ఆక్రమించుకున్నారని. భూములను కొలతలు వేయించి అడంగల్ నందు భూముల వివరాలు నమోదు చేయాలని. మేము చేనేత కార్మికులము మాకు బట్టల తయారీ రా మెటీరియల్ ధరలను అదుపు చేయాలని .తదితర వినతులు అందినాయి అన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమాని కి 15 వినతులు అందినాయని అన్నారు.బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని చిన్న లింగన్న. చిన్న పుల్లన్న మా తండ్రి బంగారిగల. పుల్లన్న. మా తండ్రి కష్టార్జితం బండి ఆత్మకూరు గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 522 లో మూడు ఎకరాలు కలదు ఆ స్థిరాస్తి కి మేమే వారసులం కానీ మాకు ఇంత వరకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరి ఉన్నారని తెలిపారు.నంద్యాల మండలం మూలసాగరం గ్రామం మినిగే .రాములమ్మ. మూలసాగరం గ్రామ పొలిమేరలో సర్వేనెంబర్ 298/3 లో ఒక ఎకరా డెబ్బై ఐదు సెంట్ల భూమి కలదు మాకు పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదు దయతో పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. .నంద్యాల మండలం కానాల గ్రామ ప్రజలు కానాల గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధాన రహదారి ప్రక్కన ఉన్నందున తరచుగా ప్రమాదాలకు విద్యార్థులు గురి అవుతున్నారు కావున ప్రధాన రహదారికి స్పీడ్ బ్రేకర్లు వేయించాలని కోరినారు.ఈ కార్యక్రమంలో . సబ్ కలెక్టర్ కార్యాలయం తహసిల్దార్ మహమ్మద్ రఫీ. సబ్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ ఫక్కీర్ హమ్మద్ .తదితర అధికారులు పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

తుగ్గలి ఫిబ్రవరి 7, (( విభారె) : ఉదయం న్యూస్: మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్ళగా సోమవారం రోజున సుంకన్న(62) సన్నాఫ్ రంగన్న ఈ సంవత్సరం సరైన వర్షాలు కురవక,పంటలు సరిగ్గా పండక అప్పులు మించిపోవడంతో చేసేదేమిలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన రైతుకు భార్య అచ్చమ్మ మరియు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు కలరు. చనిపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు తెలియజేశారు. జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# 'మిస్టర్ ప్రెగ్నెంట్'.. హే చెలి.. వచ్చేసింది



బిగ్బాస్ సీజన్ 4 ఫేమ్ సయ్యద్సోహైల్ రియాన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. మైక్ మూవీస్ బ్యానర్ పై అన్నపరెడ్డి అప్పిరెడ్డి రవిరెడ్డి సజ్జల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ తోనే అటెన్షన్ క్రియేట్ చేసిన ఈ మూవీతో శ్రీనివాస్ వింజనంపాటి దర్శకుడిగా పరిచయం అవుతున్నరు. రూపా కొడవాయూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఓ వెరైటీ కథతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ మూవీ ఫస్ట్ సింగిల్ ని ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా హే చెలీ.. అంటూ సాగే లిరికల్ వీడియోని శుక్రవారం హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు. ఇటీవల విడుదలైన 'కథ వేరుంటది.. పాటకు మంచి రెస్పాన్స్ లభించింది. తాజాగా .. హే చెలి.. అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేశారు. హీరో సోహైల్ హీరోయిన్ రూపా కొడవాయూర్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ గా ఈ పాటని చిత్రీకరించారు. ఈ పాటలో హీరోహీరోయిన్ ల మధ్య కెమిస్ట్రీ హైలైట్ గా నిలిచింది. శ్రావణ భరద్వాజ్ సంగీతం అందించారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు. సోహైల్ కు హీరోగా ఇది తొలి చిత్రం. తొలి సినిమాకే ప్రయోగాత్మక కథని ఎంచుకుని అందరిని ఆశ్చర్యపరుస్తున్నాడు. ఇందులో సోహైల్ ప్రెగ్నెంట్ గా కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ సిని మాపై అంచనాల్ని పెంచేసిం ది. ఓ హీరో ప్రెగ్నెంట్ కావడం ఏంటీ అనే ఆసక్తికరమైన అంశం నేపథ్యంలో ఓ సామాజిక అంశాన్ని ప్రస్తావిస్తూ దర్శకుడు ప్రయోగాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తుది దశకు చేరుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోం ది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్ర బృందం ఈ చిత్రానికి సంబం ధించిన లిరికల్ వీడియోలని వన్ బై వన్ రిలీజ్ చేస్తోంది. విభిన్నమైన కథతో ప్రయో గాత్మకంగా రూపొందుతున్న ఈ మూవీపై సోహైల్ భారీ అంచనాలు పెట్టుకున్నాడు. అతని అంచనాలని ఈ మూవీ ఎంత వరకు నిజం చేసి హీరోగా అతని కెరీర్ కు బాటలు వేస్తుందో చూడాలి.

# 'లైగర్' ఫైనల్ సమరం మొదలైంది

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సినిమా థియేటర్లలో సందడి చేయక దాదాపు మూడేళ్లవుతోంది. ఈ మూడేళ్లుగా ఆయన ఒకే ఒక్క ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నారు. అదే 'లైగర్'. వెర్సటైల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ అత్యంత భారీ స్థాయిలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్ అపూర్వ మోహతాతో కలిసి చార్మి పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదే చిత్రంతో ఈ ఏడాది విజయ్ దేవరకొండ బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ బాక్సర్ గా కనిపించబోతున్నాడు. వీడీ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. మూడేళ్లుగా ఈ మూవీ కోసం చాలా శ్రమిస్తున్న విజయ్ దేవరకొండ ఈ చిత్రంతో పాన్ ఇండియా స్టార్ కావాలనే పట్టుదలతో వున్నాడు. అందుకు తగ్గట్టే ఈ మూవీ కోసం వరల్డ్ ఫేమస్ బాక్సర్ మైక్ టైసన్ ని రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. మైక్ టైసన్ కీలక అతిథి పాత్రలో ఈ చిత్రంలో కనిపించబోతున్నారు. రమ్యకృష్ణ రోనిత్ రాయ్ మకరంద్ దేశ్ పాండే అబ్దులు ఖాదిర్ అమిన్ అలి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ ఫైనల్ షెడ్యూల్ గత కొన్ని రోజులుగా కరోనా కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. అంతే కాకుండా మధ్యలో విజయ్ దేవరకొండ థమ్స్ అప్ యాడ్ చేయడం వల్ల కూడా ఆలస్యమవుతూ వచ్చిన ఈ మూవీ షూటింగ్ ఎట్టకేలకు ఈ శుక్రవారం మొదలైంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శుక్రవారం ట్విట్టర్ వేదికగా అన్ లొకేషన్ కు సంబంధించిన ఓ ఫొటోని షేర్ చేస్తూ తెలియజేసింది. 'లైగర్' చివరి షెడ్యూల్ షూటింగ్ మొదలుపెట్టింది. ఆగస్టు 252022 న వరల్డ్వైడ్గా ఈ మూవీ రిలీజ్ కానుంది' అని ట్వీట్ చేశారు. విజయ్ దేవరకొండకు 'వరల్డ్ ఫేమస్ లవర్' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. దీంతో 'లైగర్' సినిమాతో ఎలాగైనా బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకుకోవాలనే పట్టుదలతో వున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' బ్లాక్ బస్టర్ హిట్ తో మళ్లీ ఫామ్లోకి వచ్చిన దర్శకుడు పూరి జగన్నాథ్ ఈ సారి అంతకు మించి హిట్ కావాలని పాన్ ఇండియా స్థాయి ఇమేజ్ని దక్కించుకోవాలని 'లైగర్'తో పోటీపడుతున్నారు. ఈ ఇద్దరు ఈ మూవీపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరి 'లైగర్' వీరి అంచనాలని ఏ మేరకు రీచ్ కానుందో తెలియాలంటే ఈ ఏడాది ఆగస్టు 25 వరకు వేచి చూడాల్సిందే



# ఆర్ఆర్ఆర్ రేంజ్ లో ఆ లేడీ ఓరియంటెడ్ మూవీ హడావుడి

టాలీవుడ్ జక్కన్న రాజమౌళి సినిమా లను ఎంత రిచ్ గా తెరకెక్కిస్తాడో.. ఎంత క్రియేటివిటీగా తెరకెక్కిస్తాడో అందరికి తెల్సిందే. సినిమా మేకింగ్ సమయంలో రాజమౌళి ఎంత కష్టపడతారో.. ఎంత క్రియేటివిటీగా ఆలోచిస్తారో అంతే క్రియేటివిటీని ప్రమోషన్ సమయంలో కూడా వినియోగిస్తారు. ఎలా




చేస్తే సినిమా ను జనాల్లోకి ఎక్కువగా తీసుకు వెళ్లగలం అనేది ఆయన వద్ద నుండి అంతా నేర్చుకోవచ్చు. ఆయన ప్రమోషన్ విషయంలో మాస్టర్ అనడంలో సందేహం లేదు. ఆయన తన ప్రతి సినిమాకు కూడా కొత్త కొత్త ప్రమోషన్ ట్రిక్స్ ను వినియోగిస్తూ ఉంటాడు. ఆయనకు వచ్చే ఆలోచనలో లేదా ఆయన టీమ్ లో ఉన్న వారి ఆలోచనలో కాని ఆర్ ఆర్ ఆర్ సినిమా కు అద్భుతమైన ప్రమోషన్ చేస్తున్నారు. ఇక రాజమౌళి తన సినిమా ట్రైలర్ ను సాదారణంగా యూట్యూబ్ లో రిలీజ్ చేయడం లేదంటే మీడియా సమావేశం ఏర్పాటు చేసి విడుదల చేయడం కాకుండా థియేటర్లలో విడుదల చేయడం పరిపాటుగా వస్తుంది. రాజమౌళి తర్వాత అలా థియేటర్లలో అభిమానుల కోసం చాలా మంది ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల ట్రైలర్స్ ను ఆ రేంజ్ లో విడుదల చేయడం జరిగింది. ఇప్పుడు ఆలియా భట్ నటించిన గంగూభాయ్ సినిమా ట్రైలర్ ను కూడా ఆ రేంజ్ లోనే విడుదల చేసేందుకు సిద్దం అయ్యారు. నేడు భారీ ఎత్తున విడుదల కాబోతున్న గంగూభాయ్ ట్రైలర్ గురించి జాతీయ మీడియాలో ప్రధానంగా చర్చ జరుగుతూ సినిమా పై అంచనాలు పీక్స్ కు చేరేలా చేశాయి. దేశ వ్యాప్తంగా ఉన్న అత్యంత ప్రముఖ మల్టీ ప్లెక్స్ చైన్ థియేటర్లలో గంగూభాయ్ ట్రైలర్ ను రిలీజ్ చేయబోతున్నారు. షో టైమింగ్స్ లో ఈ ట్రైలర్ ను స్క్రీనింగ్ చేయడం ద్వారా పెద్ద ఎత్తున అభిమానులకు ఈ ట్రైలర్ చేరుతుందనే ఉద్దేశ్యంతో చిత్ర యూనిట్ సభ్యులు న్నారు. ఆర్ ఆర్ ఆర్ ట్రైలర్ ను కూడా దేశ వ్యాప్తంగా పలు థియేటర్లలో విడుదల చేసిన విషయం తెల్సిందే. అందుకు మంచి రెస్పాన్స్ రావడంతో పాటు సినిమా కు ఉన్న బజ్ మరింతగా పెరిగింది. అందుకే ఆర్ ఆర్ ఆర్ సినిమా ట్రైలర్ తరహా లో ఆలియా భట్ హీరోయిన్ గా నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ గంగూభాయ్ ట్రైలర్ ను కూడా విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

# ఏంటి సూర్య.. ఆ షాట్ ఎందుకు ఆడటం లేదు? ఇది ఐపీఎల్ కాదుగా పొలార్డ్.. అందుకే!

: వెస్టిండీస్తో తొలి వన్డేలో అద్భుత ఇన్నింగ్స్తో ఆకట్టుకున్నాడు టీమిండియా బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్. చారిత్రాత్మక 1000వ వన్డేలో 36 బంతుల్లో 34 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ రోహిత్ శర్మ(60 పరుగులు) తర్వాత టీమిండియాలో సూర్యదే టాప్ స్కోర్. సూపర్ ఇన్నింగ్స్తో విజయంలో తన వంతు పాత్ర పోషించిన సూర్య.. మ్యాచ్ సందర్భంగా విండీస్ కెప్టెన్ కీరన్ పొలార్డ్తో జరిగిన సంభాషణ గురించి ఆసక్తికర




విషయాలు వెల్లడించాడు. ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్లో సూర్య, పొలార్డ్ సహచర ఆటగాళ్లన్న సంగతి తెలిసిందే. సూర్య ఆట, షాట్ సెలక్షన్ గురించి అవగాహన ఉన్న పొలార్డ్... వన్డే మ్యాచ్లో అతడిని మాటలతో కవ్వించాడు. ఈ విషయంపై స్పందించిన సూర్యకుమార్ యాదవ్... "పొలార్డ్ నాకు కొన్ని విషయాలు చెప్పాడు. మిడ్ వికెట్ ఓపెన్ ఉంది కదా. ఐపీఎల్లో ఆడిన మాదిరిగా ఫ్లిక్ షాట్ ఇక్కడెందుకు ఆడటం లేదు" అని నన్ను అడిగాడు. "ఐపీఎల్కు... వన్డేకు తేడా ఉంది కదా! చివరి వరకు క్రీజులో ఉండాలనుకుంటున్నా.. అందుకే షాట్ ఆడటం లేదు అని చెప్పాను" అని పేర్కొన్నాడు. అదే విధంగా అరంగేట్ర ఆటగాడు దీపక్ హుడాతో భాగస్వామ్యం నెలకొల్పడం గురించి మాట్లాడుతూ... "గత ఏడేళ్లుగా తను దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. ఆఖరి వరకు క్రీజులో ఉండటం తనకు ముఖ్యం. అయితే... తనకు నేనేమీ సలహాలు ఇవ్వలేదు. ఆత్మవిశ్వాసంతో అతడు అజేయంగా నిలిచాడు. తన పట్టుదల నాకు నచ్చింది" అని చెప్పుకొచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190